ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
3
అనంతపురం
జిల్లా వార్తలు
బుధవారం 24 ఏప్రిల్ 2024

నీళ్లు పారలేదు.. కళాశాలలూ రాలేదు..!

నెరవేరని యాడికి, పెద్దవడుగూరు ప్రజల ఆకాంక్ష...
ఉత్తుత్తి హామీలేనంటూ జగన్‌పై జనం ఆగ్రహం

ప్రతిపక్షనేతగా జగన్‌రెడ్డి తమ మండలాల్లో పాదయాత్ర చేయడంతో ఎంతో అభివృద్ధి జరుగుతుందని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. పాదయాత్ర సందర్భంగా యాడికి, పెద్దవడుగూరు మండలాలకు జగన్ ఎన్నో ఆశలు కల్పించారు. ముఖ్యంగా యాడికి కాలువకు నీళ్లు వచ్చేలా చేస్తామని ఇచ్చిన హామీ ట్రయల్‌రన్‌కే పరిమితమైంది. అదే విధంగా యాడికి, పెద్దవడుగూరు మండలాల్లో జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేస్తామన్నా అవీ ఆచరణకు నోచుకోలేదు. దీంతో ఆ రెండు మండలాల ప్రజలు జగన్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.




బహిరంగ సభలో మాట్లాడుతున్న జగన్ (ఫైల్)

తాడిపత్రి టౌన్

తాడిపత్రి నియోజకవర్గంలోని పెద్దవడుగూరు, యాడికి మండలాల్లో వైఎస్ జగన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలేవీ నెరవేర్చలేదని ఆయా మండలాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2017 డిసెంబరు 5న పెద్దవడుగూరు మండల కేంద్రంలో జరిగిన బహిరంగ సభలో ఎన్నో హామీలు గుప్పించారు. ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరిస్తానని, యాడికి కాలువకు సాగు నీరు అందిస్తానని హామీ ఇచ్చారు. యాడికి కాలువకు అరకొర నీరు మాత్రమే సరఫరా చేశారు. 2019 ఎన్నికల్లో వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి విజయానికి ఈ రెండు మండలాలు కీలకంగా నిలిచాయి. ఈ రెండు మండలాల్లోనే పాదయాత్ర చేయడంతో ఇవి ఎంతో అభివృద్ధి చెందుతాయని స్థానికులు ఆశలు పెట్టుకున్నారు. కానీ ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ప్రజలు వైసీపీపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జగన్‌రెడ్డి పాదయాత్ర సమయంలో యాడికి కాలువకు నీళ్లు వచ్చేలా చేస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఐదు సంవత్సరాలవుతున్నా నామమాత్రంగానే నీరు విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. కాలువ నీటితో రైతులు ఒక్క పంట కూడా పండించిన దాఖలాలు లేవు. యాడికిలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఆ హామీ కూడా ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. పెద్దవడుగూరు మండలంలోనూ జూనియర్ కళాశాల ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అది కూడా అమలుకు నోచుకోలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఏర్పాటు చేస్తున్నామంటూ పలు పర్యాయాలు ప్రజాప్రతినిధులు హంగామా చేశారేగానీ ఇంతవరకు ఒక్క అడుగూ ముందుకు పడలేదు.

నీటి విడుదల ఏదీ..?



పాదయాత్ర సమయంలో జగన్‌రెడ్డి యాడికి కాలువకు పూర్తిస్థాయిలో నీరు ఇస్తామని హామీ ఇచ్చారు. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక పదవీ కాలం పూర్తయ్యేసరికిగానీ యాడికి కాలువకు నీరు పూర్తిస్థాయిలో విడుదల చేయలేదు. కంటితుడుపు చర్యగా ట్రయల్‌రన్ మాదిరిగా నీరు వదిలారు తప్ప యాడికి కాలువ కింద రైతులకు ఒక్కపంటకు కూడా పండించిన దాఖలాలు లేవు. ఉత్తుత్తి హామీలు ఇచ్చి ప్రజలను మభ్యపెట్టారు.

- జగదీష్, రైతు, ఎన్.కొత్తపల్లి, యాడికి మండలం

జూనియర్ కళాశాల హామీ ఉత్తిదే



పాదయాత్ర సమయంలో జగన్‌రెడ్డి యాడికిలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఇంతవరకు నెరవేర్చలేదు. ప్రభుత్వ జూనియర్ కళాశాల లేకపోవడంతో ఎంతోమంది నిరుపేద విద్యార్థులు దినసరి కూలీలుగా, కార్మికులుగా మారుతున్నారు. ఐదేళ్ల గడిచినా జూనియర్ కళాశాల ఏర్పాటు చేయలేదంటే యాడికి వాసులను మోసం చేసినట్లే.

- నరసింహులు, పిన్నేపల్లి, యాడికి మండలం

పరిటాల సునీత.. కేశవ్‌కు బీ ఫారాలు


పయ్యావుల కేశవ్, పరిటాల సునీతకు బీఫారం అందజేస్తున్న చంద్రబాబు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 23: టీడీపీ రాప్తాడు, ఉరవకొండ అభ్యర్థులు పరిటాల సునీత, పయ్యావుల కేశవ్‌కు పార్టీ అధినేత చంద్రబాబు మంగళవారం బీ ఫారాలను అందజేశారు. విజయనగరం జిల్లా ఎస్ కోటలో చంద్రబాబును వారు కలిశారు. ఉరవకొండ, రాప్తాడులో భారీ మెజార్టీతో విజయం సాధించి తిరిగి రావాలని ఆయన వారిని ఆశీర్వదించారు. ఈ నెల 25న రాప్తాడులో అట్టహాసంగా నామినేషన్ వేస్తామని మాజీ మంత్రి పరిటాల సునీత తెలిపారు.

ముగ్గురు ఉద్యోగులపై వేటు

అనంతపురం టౌన్ / శింగనమల, ఏప్రిల్ 23: వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్న ముగ్గురు ఉద్యోగులపై వేటు పడింది. తాడిపత్రి మున్సిపాలిటీలో పనిచేస్తున్న హనుమంతరెడ్డి కాంట్రాక్ట్ ఉద్యోగి. అతను ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి వైసీపీ కార్యక్రమంలో పాల్గొన్నట్లు ఫిర్యాదులు అందాయి. విచారణ చేపట్టిన అనంతరం అతన్ని కలెక్టర్ మంగళవారం సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే శింగనమల మండలంలోని సోదనపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన వైసీపీ ప్రచారంలో ఎండీయూ ఆపరేటర్ చిక్కాల మల్లికార్జున, వలంటీర్ నాగలక్ష్మి పాల్గొన్నారు. వారిని విధుల నుంచి తొలగించినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్రీను వెన్నెల మంగళవారం తెలిపారు.

జాతీయ లోక్ అదాలత్ వాయిదా

అనంతపురం క్రైం, ఏప్రిల్ 23: జాతీయ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశాల మేరకు మే 11న జరగాల్సిన జాతీయ లోక్ అదాలత్‌ను జూన్ 29కు వాయిదా వేసినట్లు జిల్లా న్యాయాధికారి శ్రీనివాస్, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి శివప్రసాద్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల పరిధిలోని అన్ని కోర్టుల్లో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తామన్నారు. ఇదివరకు నోటీసులను అందుకున్న వారు మే 11న కాకుండా జూన్ 29న జాతీయ లోక్ అదాలత్ ముందు హాజరై తమ కేసులను రాజీ చేసుకోవాలని సూచించారు.

సీమ నీటిపై మీ విధానం ఏమిటి..?

సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న సమితి సభ్యులు

గుంతకల్లు టౌన్, ఏప్రిల్ 23: రాయలసీమ నీటి ప్రాజెక్టులపై రాజకీయ పార్టీలు తమ విధానాలను ప్రకటించాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి, జలసాధన సమితి అధ్యక్షుడు రామ్‌కుమార్, ఓపీడీఆర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలం రాగులపాడు సమీపంలోని హంద్రీనీవా పంప్‌హౌస్ వద్ద కాలువను మంగళవారం వారు సందర్శించారు. అనంతరం గుంతకల్లు పట్టణంలోని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. హంద్రీనీవా ప్రాజెక్టు ప్రారంభించి 35 ఏళ్లు గడిచినా.. నేటికీ పూర్తి కాలేదని అన్నారు. రాయలసీమలోని 6,02,500 ఎకరాలకు నీటిని అందించే విధంగా హంద్రీనీవా ప్రాజెక్టును పూర్తిస్థాయిలో రీ డిజైన్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రధాన కాలువ ప్రవాహ సామర్థ్యాన్ని 10 వేల క్యూసెక్కులకు పెంచి.. ఆ నీటిని నిల్వ చేసుకునేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పీఏబీఆర్‌లో 11 టీఎంసీల నీటిని నిల్వ చేసేందుకు భూసేకరణ చేపట్టాలని కోరారు. రిజర్వాయర్ సామర్థ్యాన్ని, భద్రతను మెరుగుపరచాలని అన్నారు. హెచ్చెల్సీకి అనుసంధానంగా ఉంతకల్లు వద్ద 10 టీఎంసీల రిజర్వాయర్, పెరవలి వద్ద మరో రిజర్వాయర్‌ను నిర్మించాలని డిమాండ్ చేశారు. నీటి వివాదాల పరిష్కారం కోసం ఏర్పాటు చేసిన కొత్త ట్రిబ్యునల్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, డివిజన్ కమిటీ కార్యదర్శి చిన్న, జలసాధన సమితి నాయకులు నాగరాజు, ఏసురత్నం, పెద్దన్న తదితరులు పాల్గొన్నారు.

ఫెసిలిటేషన్ సెంటర్లలోనే ఓటు వేయాలి

హౌస్ ఓటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నాం
జిల్లా ఎన్నికల అధికారి వినోద్‌కుమార్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు వినోద్‌కుమార్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 23: పోస్టల్ బ్యాలెట్ ఓటర్లు ఫెసిలిటేషన్ సెంటర్లలోనే ఓటు వేయాల్సి ఉంటుందని జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్ అన్నారు. కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్, డీపీఓ ప్రభాకరరావుతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియలో పోస్టల్ బ్యాలెట్ కీలకమైనదని, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ అవకాశం కల్పిస్తామని అన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటు వేయకపోతే ఉద్యోగులకు అవగాహన లేదని, సౌకర్యాలు కల్పించలేదనే అపోహలు వచ్చే అవకాశం ఉందని అన్నారు. అర్హులందరూ పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకోవాలని సూచించారు. గతంలో దరఖాస్తు చేసుకున్నవారికి పోస్టల్ ద్వారా వారి ఇళ్లకు బ్యాలెట్ పంపించేవారని, ఆ తరువాత ఓటు వేసి అధికారులు ఏర్పాటు చేసిన కౌంటర్లలో అందించేవారని అన్నారు. ఈ సారి పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నవారు ఓటు వినియోగించుకునేందుకు ప్రత్యేక షెడ్యూల్ ఇస్తామని, ఆయా తేదీలలో ఫెసిలిటీ సెంటర్లను ఏర్పాటు చేసి పోలింగ్ నిర్వహిస్తామని అన్నారు. జిల్లాలో ఎనిమిది నియోజకవర్గాలలో ఒక్కో ఫెసిలిటీ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. మే 3 నుంచి 6వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ నిర్వహిస్తామని తెలిపారు. హోం ఓటింగ్‌కు ఏర్పాట్లు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో హోం ఓటింగ్‌కు అర్హులైన వృద్ధులు 988 మంది, దివ్యాంగులు 26,097 మంది ఉన్నారని, కానీ వీరిలో 1,304 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. వీరికి మే 5 నుంచి 9వ తేదీ వరకు పోలింగ్ నిర్వహణకు 38 బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

టీబీ మందులు నిండుకున్నాయ్..!

ఆరు నెలలుగా అరకొరగా సరఫరా
మార్కెట్‌లో కొంటున్న బాధితులు




జిల్లా కేంద్రంలోని సర్వజన ఆస్పత్రిలో ఉన్న జిల్లా టీబీ సెంటర్

అనంతపురం టౌన్, ఏప్రిల్ 23: వైసీపీ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని గాలికి వదిలేసింది. ప్రభుత్వ ఆస్పత్రుల్లో దీర్ఘకాలిక వ్యాధులకు మందులు అందుబాటులో లేకపోయినా పట్టించుకోలేదు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే ఇవ్వాల్సిన మాత్రలను.. బయట అమ్ముతున్నారు. 'అక్కడికి వెళ్లి కొనండి' అని వైద్యులు రాసిస్తున్నారు. జిల్లాలో క్షయ వ్యాధి బాధితులు మందులను బయటే కొంటున్నారు. 'ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ఆశయం. ఇంటి వద్దకే వైద్యులను పంపుతాం. మెరుగైన చికిత్స చేయిస్తాం. క్షయ అంతం.. ప్రభుత్వ పంతం' అంటూ వైద్యశాఖ అధికారులు సైతం ఊదరగొడుతుంటారు. టీబీకి మందులు ఉచితంగా ఇస్తామని, కోర్సు పూర్తిగా వాడాలని చెబుతుంటారు. కానీ చేతల్లో చూపడం లేదు. జిల్లాలోని చాలా సెంటర్లకు టీబీ మందులు కొన్ని నెలలుగా సరఫరా కావడం లేదు. ఈ వ్యాధి బాధితులు క్రమం తప్పకుండా మందులు వాడాల్సి ఉంటుంది. ఆ మందులను మార్కెట్‌లో అమ్మకుండా ప్రభుత్వం ఆంక్షలు కూడా విధించింది. కానీ ఇవేవీ సరిగా అమలు కావడం లేదు.

3,976 మంది బాధితులు

జిల్లా వైద్యశాఖ లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో 3,976 మంది టీబీ బాధితులు ఉన్నారు. వీరిలో అనంతపుం జిల్లాలో 2,392 మంది, శ్రీసత్యసాయి జిల్లాలో 1,584 మంది ఉన్నారు. వీరందరికీ ప్రభుత్వమే చికిత్స చేయిస్తోంది. 19 టీబీ యూనిట్స్, 88 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్య సేవలు అందిస్తోంది. వ్యాధి తీవ్రతను బట్టి మందుల కోర్సు వాడాల్సి ఉంటుంది. డాక్టర్లు చెబుతున్న మేరకు డ్రగ్స్ సెన్సిటివ్ (డీఎస్ టీబీ) టీబీ అయితే ప్రతి రోజు యాంటీ టీబీ మాత్రలు రెండు పూటల వేసుకోవాల్సి ఉంటుంది. అదే సెన్సిటివ్ డ్రగ్స్ టీబీ అయితే 9 నెలల నుంచి 24 నెలల వరకు యాంటీ టీబీ మాత్రలు రెండు పూటలా తీసుకావాల్సి ఉంటుంది. మందులను సక్రమంగా వాడకపోతే వ్యాధి తీవ్రత అలాగే ఉంటుంది. పైగా ఇతర సమస్యలు తలెత్తుతాయని వైద్యవర్గాలే అంటున్నాయి. ఇంతటి కీలకమైన మాత్రలు గత ఆరునెలలుగా సక్రమంగా సరఫరా చేయడం లేదు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. పైగా ఈటీబీ ప్రోగ్రామ్ కేంద్ర ప్రభుత్వానిదని, ఈ మందులు కేంద్రమే పంపిణీ చేయాల్సి ఉంటుందని సాకులు చెబుతున్నారు.

సమస్య లేకుండా చూస్తున్నాం...

టీబీ మందులు సకాలంలో సరఫరా కాకపోవడం నిజమే. అయినా బాధితులకు మందుల సమస్య లేకుండా చూస్తున్నాం. ప్రైవేటులో కొని అందిస్తున్నాం. నాలుగు బాక్స్‌లలో 4 వేల స్ట్రిప్స్ వైజాగ్ నుంచి వస్తున్నాయి. ఒక్కొక్క షీట్‌లో నెలకు సరిపడా మాత్రలు ఉంటాయి. ఇప్పుడు కూడా మావద్దకు వస్తే మందులు ఇచ్చి పంపిస్తాం. జిల్లా కేంద్రంలో రెండు ప్రైవేటు మందుల షాపులలో ఈ మందులు ఇవ్వడానికి అనుమతి ఇచ్చాం. వారు మందులు తీసుకున్న వారి వివరాలు మాకు ఇవ్వాల్సి ఉంటుంది.

- డాక్టర్ అనుపమ జేమ్స్, జిల్లా క్షయనివారణ అధికారి

ఎప్పుడు బాగుపడుతుందో..!



అనంతపురం పెద్దాసుపత్రిలో రోగులకు ప్రత్యక్ష నరకం కనిపిస్తోంది. వైద్యం, ఔషధాలు, సేవలు.. అన్నింటా వైఫల్యం కనిపిస్తోంది. అందుకు ఉదాహరణ.. ఈ ఫొటోలో కనిపిస్తున్న దృశ్యం..! రాయదుర్గం మండలం భూపసముద్రం గ్రామానికి చెందిన నాగమణికి కడుపునొప్పి తీవ్రంగా వచ్చింది. కుటుంబ సభ్యులు ఆమెను అనంతపురం పెద్దాస్పత్రికి మంగళవారం తీసుకొచ్చారు. ఎమర్జెన్సీ విభాగం డాక్టరు.. అల్ట్రాసౌండ్ స్కానింగ్‌కు రాసిచ్చారు. ఎంఎన్‌ఓ ఆమెను స్ట్రెచర్‌లో స్కానింగ్ సెంటర్‌కు తీసుకెళ్లారు. స్కానింగ్ పూర్తయ్యాక ఆమె బయటకు వచ్చి చూస్తే.. స్ట్రెచర్ కనిపించలేదు. కడుపునొప్పి ఏమాత్రం తగ్గకపోవడంతో ఆమె కింద పడుకుని పొర్లుతూ, విలవిలలాడింది. ఆమె భర్త సిద్ధేశ్వర స్ట్రెచ్చర్ కోసం తిరిగారు. పరిస్థితిని వివరించి.. వైద్యుల సాయం కోరారు. ఎవరూ పట్టించుకోలేదు. దీంతో దిక్కుతోచక భార్య వద్దకు వచ్చాడు. ఉక్కపోత, కడుపునొప్పితో అల్లాడిపోతున్న ఆమెకు తన బంధువుతో కలిసి తన టవల్‌తో ఊదుతూ సపర్యలు చేశారు. అటుగా వెళ్లిన ఆంధ్రజ్యోతి ఫోటోగ్రాఫర్, రిపోర్టర్ గమనించి.. వివరాలు అడిగితే.. గోడు వెళ్లబోసుకున్నారు. రెండు గంటల నుంచి ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని ఆర్ఎంఓ డాక్టర్ హేమలత దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకువెళ్లింది. దీంతో ఆమె సిబ్బందిని పురమాయించి, నాగమణిని వార్డుకు తరలింపజేశారు.

- అనంతపురం టౌన్

వేసవిలో విద్యుత్ సమస్యలు

లో ఓల్టేజీతో వినియోగదారుల సతమతం
ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యానికి మించి కనెక్షన్లు
వినియోగం పెరిగిపోవడంతో ఇబ్బందులు
ఉక్కపోతతో అల్లాడిపోతున్న ప్రజలు

అనంతపురంరూరల్, ఏప్రిల్ 23: ఎండ వేడిమి, వడగాడ్పులతోనే ఇబ్బంది పడుతుంటే విద్యుత్ సమస్యలు ప్రజలకు కంటి మీద కునుకులేకుండా చేస్తున్నాయి. వేసవి కాలం కావడంతో విద్యుత్ వినియోగం పెరిగింది. లోఓల్టేజీ సమస్యలు తలెత్తుతున్నాయి. దీంతో ఇళ్లలో ఫ్యాన్లు తిరగడం కూడా కష్టంగా మారింది. ఫలితంగా ఇళ్లలో ఉన్నా ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. సమస్యను అధిగమించేందుకు విద్యుత్ శాఖ చేపడుతున్న పనులు ప్రజలకు ఉపశమనం కలిగించలేకపోతున్నాయి. దీంతో ప్రజలు విద్యుత్ శాఖపై తీవ్ర స్థాయిలో మండిపడుతున్నారు. వేలకు వేలు బిల్లులు వేస్తున్నారు కానీ సమస్యలు తీర్చడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పెరిగిన విద్యుత్ వినియోగం

ప్రస్తుత వేసవిలో ఎండ నిప్పుల కొలిమిని తలపిస్తోంది. రోజు వారి ఉష్ణోగ్రతలు 42డిగ్రీల నుంచి 45డిగ్రీల మధ్య నమోదవుతున్నాయి. ఉదయం 10గంటలు దాటితే ఇళ్లలో నుంచి బయటకు రాలేని పరిస్థితి. సాయంత్రం 6గంటలు వరకు సూరిడు చుర్రుమనిపిస్తున్నాడు. దీంతో జనం ఇళ్లకే పరిమితం అవుతున్నారు. ఈక్రమంలో విద్యుత్ వినియోగం భారీగా పెరిగింది. ఉమ్మడి జిల్లాలోని ఆరు డివిజన్ల పరిధిలో 12లక్షల గృహకనెక్షన్లు ఉన్నాయి. రోజువారిగా విద్యుత్ వినియోగం 19మిలియన్ యూనిట్ల నుంచి 21మిలియన్ యూనిట్లుగా ఉంటోంది. ఈ నేపథ్యంలో విద్యుత పరమైన సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా లో ఓల్టేజీ సమస్యతో ఎక్కువగా ఇబ్బంది పడుతున్నారు.


ఓవర్ లోడు కారణంగా పాపంపేటలో ట్రాన్స్‌ఫార్మర్ వద్ద కాలిపోతున్న మీటర్

సామర్థ్యానికి మించి కనెక్షన్లు..

ఉమ్మడి జిల్లాలో గృహాలకు సంబంధించి 500కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు ఎనిమిది, 315కేవీఏ-70, 250కేవీఏ-43, 200కేవీఏ తొమ్మిది, 160కేవీఏ-962, 100కేవీఏ-6132, 75కేవీఏ-82, 63కేవీఏ -3253, 50కేవీఏ-169, 40కేవీఏ-61, 25కేవీఏ -321 త్రీఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. అలాగే సింగిల్ ఫేజ్ లో 25కేవీఏ-1280, 16కేవీఏ- 2804, 15కేవీఏ-8911, 10కేవీఏ- 4954 చొప్పున ట్రాన్స్‌ఫార్మర్లు క్షేత్రస్థాయిలో ఉన్నాయి. మొత్తంగా 30వేల ట్రాన్స్‌ఫార్మర్లు గృహాలకు సంబంధించి ఉన్నట్లు విద్యుత్ అధికారుల లెక్కలు చెబుతున్నాయి. అయి తే ఈ కనెక్షన్లకు సరిపడా ట్రాన్స్ ఫార్మర్లు క్షేత్రస్థాయిలో లేకపోవడంతో విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తుతున్నాయన్న వాదనలు ఆయా వర్గాల నుంచే వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఏ ఇంట్లో చూసిన 1కేవీఏకి పైగానే విద్యుత్ వాడకం ఉంటోంది. ఈకారణంగానే 2కేవీ ఏకు పునరుద్ధరణ పేరుతో విద్యుత్ అధికారులు రూ.1500లకుపైగానే వినియోగదారుల నుంచి ఇటీవల కట్టించుకున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో 25ట్రాన్స్‌ఫార్మర్‌కు 25కు మించి గృహకనెక్షన్లు ఉండకూడదు. క్షేత్రస్థాయిలో మాత్రం 60 నుంచి 100 కనెక్షన్లు ఉంటున్నాయి. ఈక్రమంలో లో ఓల్టేజీ, విద్యుత్ వైర్లు కాలి తెగిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలడం, ఇతరత్ర సమస్యలు ఏర్పడుతున్నాయి. ఈ క్రమంలోనే లోఓల్టేజీ, హైఓల్టేజీ సమస్యలతో ఇళ్లలోని ఎలక్ట్రిక్ వస్తువులు దెబ్బతింటున్నాయి. విద్యుత్ కనెక్షన్లకు అనుగుణంగా ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేస్తే కొంత వరకు సమస్యను అధిగమించవచ్చు. ఆమేరకు విద్యుత్ అధికారులు చొరవ చూపాల్సి ఉంది. అనంతపురం టౌన్ పరిధిలోని కొన్ని సబ్‌స్టేషన్లలో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచారు. ఈక్రమంలో ఆయా ప్రాంతాల్లో కొంత మేరకు విద్యుత్ సమస్యలు తగ్గినట్లు తెలుస్తోంది. మరి కొన్ని ప్రాంతాల్లో సమస్య అలాగే ఉండటంతో ఆయా ప్రాంతాల్లో ఇబ్బందులు తప్పడం లేదు.

ఫ్యాన్ స్పీడు ఐదులో ఉన్నా.. రెండులో ఒక్కటే



ప్రస్తుతం విద్యుత్ సమస్య తీవ్రంగా ఉంది. బయటకు వెళ్లలేని పరిస్థితి. ఇంట్లో ఉంటే కరెంటు సమస్య. లో ఓల్టేజీ కారణంగా ఇంట్లో ఫ్యాన్ స్పీడు ఐదులో పెట్టినా..రెండులో తిరుతున్నట్లు ఉంటోంది. దీంతో ఇళ్లలోని ఇన్‌వర్టర్లు ఇతరత్ర ఎలక్ట్రిక్ వస్తువులు పాడవుతున్నాయి. - హరిప్రసాద్, పాపంపేట

కరెంటు సరఫరా అధ్వానంగా ఉంది



కరెంటు సరఫరా అధ్వానంగా ఉంటోంది. కరెంటు ఎప్పుడుంటుందో..ఎప్పుడు పోతుందో తెలియనీ పరిస్థితి. ఒక్కసారి పోయిందంటే గంట..గంటన్నర రాదు. ఉంటే లోఓల్టేజీ సమస్య. ఫ్యాన్లు తిరగడం కష్టమే. అంత అధ్వానంగా ఉంటోంది. - నాగభూషణం, రుద్రంపేట

అసెంబ్లీకి 50

పార్లమెంటుకు రెండు..
కొనసాగుతున్న నామినేషన్లు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 23: నామినేషన్ల దాఖలుకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో అభ్యర్థులు జోరు పెంచారు. అనంతపురం ఎంపీ స్థానానికి మంగళవారం ఒకరు నామినేషన్ వేశారు. బీఎస్పీ అభ్యర్థి బి.నారాయణప్ప, ఎస్పీ అభ్యర్థి నిజామ్ జిల్లా ఎన్నికల అధికారి వినోద్ కుమార్‌కు నామినేషన్ పత్రాలను సమర్పించారు. అసెంబ్లీ స్థానాల్లో అనంతపురం అర్బన్‌లో 14, రాప్తాడులో 08, ఉరవకొండలో 07, గుంతకల్లులో 03, కళ్యాణదుర్గంలో 06, రాయదుర్గంలో 05, తాడిపత్రి 2, శింగనమలలో ఐదు నామినేషన్లు దాఖలయ్యాయి.

- అనంతపురం అర్బన్‌లో టీడీపీ అభ్యర్థి దగ్గుబాటి వెంకటేశ్వరరావు తరఫున పార్టీ నాయకులు గాజుల ఆదెన్న, సరిపూటి రమణ, రాయల్ మురళి నామినేషన్ దాఖలు చేశారు. ఇండియా కూటమి తరఫున సీపీఐ అభ్యర్థి జాఫర్, బీఎస్పీ తరఫున కె.నాగరాజు, ఆల్ ఇండియా ఫార్వర్డ్‌బ్లాక్ తరఫున సూర్యశేఖరరెడ్డి, స్వతంత్రులుగా మల్లికార్జున, మసూద్‌వలి, సుధీంద్రరావు, సి.మల్లికార్జున, ఫిరోజ్‌ఖాన్, జయలక్ష్మి, అబ్దుల్ అజీజ్ నామినేషన్ వేశారు.
- రాప్తాడులో వైసీపీ అభ్యర్థి తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తరఫున ఆయన తండ్రి తోపుదుర్తి ఆత్మారామిరెడ్డి, స్వతంత్రులుగా పోతుల నాగరాజు, ఎం.రామాంజి, ఎ.శంకరయ్య నామినేషన్ వేశారు.
- ఉరవకొండలో వైసీపీ తరఫున విశ్వేశ్వరరెడ్డి, ప్రణయ్‌రెడ్డి నామినేషన్ వేశారు. బీఎస్పీ తరఫున తిప్పేస్వామి, ఆల్ ఇండియా కిసాన్ జనతా పార్టీ తరఫున కేబీ చిన్నక్క, జై భారత్ నేషనల్ పార్టీ తరఫున రామాంజినేయులు, స్వతంత్రులు కేబీ మూమన్‌దాస్, మొలకల రామాంజినేయులు నామినేషన్ వేశారు.
- గుంతకల్లులో స్వతంత్రులు ఎం.ఖమార్ బేగం, షేక్ అబ్దుల్ మాలిక్, పి.రహిమ నామినేషన్ వేశారు.
- తాడిపత్రిలో జై భీమ్‌రావ్ భారత్ పార్టీ తరఫున ఎట్టి వీరనాగరాజు, భారత చైతన్య యువజనపార్టీ తరఫున బెండులూరి దాకరాజు నామినేషన్ వేశారు.
- కళ్యాణదుర్గంలో వైసీపీ అభ్యర్థి తలారి రంగయ్య, స్వతంత్రులు గంగురి సురేష్, విశ్వనాథ్‌రాజు, ఈగటి రమేష్, అశోక్, జైభారత్ నేషనల్ పార్టీ తరఫున లక్ష్మణమూర్తి నామినేషన్ వేశారు.
- రాయదుర్గంలో కాంగ్రెస్ తరఫున చిన్నప్పయ్య, భారత యువజన పార్టీ తరఫున ప్రతాప్‌రెడ్డి, స్వతంత్రులు కావలి శ్రీనివాసులు, కురబ శ్రీనివాసులు నామినేషన్ వేశారు.
- శింగనమలలో టీడీపీ అభ్యర్థి బండారుశ్రావణిశ్రీ తరఫున ఒకరు, బీఎస్పీ తరఫున ఒకరు, స్వతంత్రులు ముగ్గురు నామినేషన్ వేశారు.


బండారు శ్రావణి తరఫున నామినేషన్ వేస్తున్న కుటుంబసభ్యులు

ఓటు వేయకపోతే చచ్చినట్లు లెక్క

గంగులప్ప, చెర్లోపల్లి, కదిరి మండలం



వెనుకటి కాలంలో ఓటు వేయకపోతే చచ్చినవారికింద లెక్క కట్టేవారు. ఎన్నికల రోజున ఎన్ని పనులున్నా, ఎంత దూరంలో ఉన్నా ఓటు మాత్రం కచ్చితంగా వేసేవాళ్లం. ఓటు వేయడం అనేది ఎంతో పవిత్రమైన బాధ్యతగా చెప్పుకునేవారం. డబ్బులు తీసుకుని ఓటు వేసే పద్ధతులు లేవు. కేవలం మనిషి మాట, మర్యాదను బట్టి బుద్ధిమంతులకు ఓటు వేసేవారం. ఇపుడు కాలం మొత్తం మారింది. ఓటుకు డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటి ఎన్నికల్లో నాటి విలువలు, మర్యాదలు కనుమరుగయ్యాయి.

\- కదిరి అర్బన్

మంచోడు అయితే చాలనుకునేవాళ్లం

ఆంజనేయులు,తాటిచెర్ల, అనంతపురం రూరల్



అప్పటి ఎన్నికలకు, ఇప్పటికీ చాల తేడా ఉంది. ఇంత హంగు..ఆర్భాటాలు అప్పుడు ఉండేవి కావు. అప్పట్లో అభ్యర్థి నీతి, నిజాయతీ కలిగి మంచోడు అయితే చాలు అనుకునేవాళ్లం. ఊళ్లో వాళ్లంతా బజారు కట్ట వద్ద చర్చించుకుని ఫలాన వ్యక్తికి ఓటు వేయాలని నిర్ణయించేవారు. ఊళ్లోవాళ్లు దానికే కట్టుబడి ఉండేవాళ్లు. ఆప్రకారం ఓటు వేసేవాళ్లం. అదేరీతిలో నాయకులు జనాలకు విలువిచ్చేవారు. చెప్పిన పనులు చేయడానికి ప్రయత్నించేవారు. ఇప్పుడు రాజకీయం అంతా డబ్బుతోనే నడుస్తోంది. అప్పట్లో మంచి, మర్యాదలతోనే పనులు జరిగేవి.

\- అనంతపురం రూరల్

ఒక్క నెలలోనైనా ఒకటిన పెన్షన్ ఇచ్చాడా?

అశ్వత్థ, పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు, శింగనమల మండలం



ఐదేండ్లలో ఒకటో తేదీన ఒక్కసారి కూడా పింఛన్ ఇవ్వలేదు. మళ్లీ వైసీపీకి ఎందుకు ఓటెయ్యాలి. తగ ఎన్నికల సమయంలో పెన్షన్ దారులకు ప్రభుత్వం నుంచి వచ్చే డీఏలు, పీఆర్సీలు ఇస్తామని, పెన్షన్ ప్రతి నెల ఒకటో తేదీకే ఇస్తామని, తన తండ్రి పాలన మరిచేలా పాలిస్తానని జగన్ హామీ ఇచ్చాడు. ముఖ్యమంత్రి కాగానే అవన్నీ మరచిపోయాడు. ప్రతి నెలా 5 నుంచి 10 తేదీలోనే పెన్షన్ జమ చేశాడు. పెన్షనర్లకు రావాల్సిన ఆరు డీఏలు, పీఆర్సీ ఇవ్వకుండా మోసం చేసిన వైసీపీకి ఎలా ఓటెయ్యాలి.

\- శింగనమల

గ్రామ పెద్ద మాటకు కట్టుబడేవాళ్లం..



పుట్టరంగప్ప, రైతు, మడకశిర

అప్పట్లో ఎన్నికల హడావుడి ఇంతలా ఉండేది కాదు. ఎన్నికలలో పోటీచేసే అభ్యర్థులు గ్రామానికి వచ్చినా ఇంటింటికి తిరిగి ఓట్లు అడిగే వాళ్లకాదు. గ్రామం లోని దేవాలయం లేక రావి చెట్టు వద్దకు పిలిచే వాళ్లు. గ్రామానికి పెద్దగా ఉండే వ్యక్తి సమక్షంలో ఓట్లు అడిగేవారు. తర్వాత గ్రామ పెద్ద ఏమి చెబితే దానికి కట్టుబడి ఓటు వేసేవాళ్లం. పోలింగ్ కేంద్రం దూరంగా ఉన్నా నడుచుకుని వెళ్లి ఓటు వేసే వాళ్లం. అప్పట్లో రెండు పార్టీలే ఉండేవి. మద్యం ప్రభావం ఉండేది కాదు. మద్యం తాగేవాళ్లు చాలా తక్కువ. మద్యం, డబ్బు పంచేవారు కాదు. కనీసం ఆకు వక్క ఇచ్చినా చాలామంది తీసుకునే వాళ్లకాదు. నిజాయతీగా ఓటు వేసే వాళ్లు. కొంతమంది ముసలి వాళ్లకు మాత్రం కల్లు ఇచ్చే వారు.

\- మడకశిర

జన కేతనం

ఆంధ్రజ్యోతి



తనకల్లులో పాడి పశువులు

- మూడేళ్లుగా అందని వైఎస్సార్ పశు బీమా
- పరిహారం కోసం పాడి రైతుల ఎదురు చూపు
- ప్రీమియం చెల్లింపు నిలిపేసిన జగన్ ప్రభుత్వం



పశువులకు చికిత్స చేస్తున్న వైద్య సిబ్బంది

పాడి రైతులకు పంగనామాలు

కళ్యాణదుర్గం/తనకల్లు/బొమ్మనహాళ్, ఏప్రిల్ 23: పాడి రైతులను ఆదుకునేందుకు ప్రకటించిన వైఎస్సార్ పశు నష్ట పరిహారం పథకం నిర్వీర్యమైపోయింది. చనిపోయిన పశువులకు పరిహారం ఇస్తామని గొప్పలు చెప్పి, అధికారంలోకి వచ్చిన వైసీపీ.. ఏడాది పాటు పథకాన్ని అమలు చేసింది. ఆ తరువాత రద్దు చేసింది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో పశువుల బీమా కింద తక్షణ సాయం రూ.30 వేలు నుంచి రూ.50 వేల వరకు అందచేసేవారు. పశువైద్యాధికారులు వెంటనే సందర్శించి, వారంలోగా బీమా పరిహారం అందచేసేవారు. వైసీపీ ప్రభుత్వంలో పాడి రైతులకు పంగనామాలు పెట్టారు.

మూడేళ్లుగా బకాయిలు

- కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ మండలాల పరిధిలో వైఎస్సార్ పశునష్ట పరిహారం అందాల్సినవారు 3,050 మంది వరకు ఉన్నారని పశు వైద్యాధికారులు చెబుతున్నారు. పశు మరణాల గురించి పోర్టల్‌లో నమోదు చేశారు. వారికి రూ.4 కోట్లకు పైగా పరిహారం పెండింగ్‌లో ఉంది.
- కదిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పశువులు, గొర్రెలు, మేకలు, నష్టపోయిన వందలాదిమంది రైతులు పరిహారం కోసం ఎదురు చూస్తున్నారు. మూడేళ్లుగా పరిహారం రావడంలేదని రైతులు వాపోతున్నారు. నంబులపూలకుంట మండల వ్యాప్తంగా 100 పశువులు, నల్లచెరువు 164, తనకల్లు 200, కదిరి రూరల్‌లో 428, గాండ్లపెంట 47 పశువులు చనిపోయాయి. వీరెవరికీ పరిహారం అందలేదు.

ఇదీ పథకం..

ప్రమాదవశాత్తు, అనారోగ్యంతో పశువులు, జీవాలు (మేకలు, గొర్రెలు) మృతి చెందితే ఈ పథకం కింద ఆదుకోవాల్సి ఉంది. వైసీపీ ప్రభుత్వం 2019లో వైఎస్సార్ పశు నష్టపరిహారం పథకానికి శ్రీకారం చుట్టింది. ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లిస్తుందని ప్రకటించారు. జెర్సీ, హెచ్‌ఎఫ్ పశువు మరణిస్తే రూ.30 వేలు, దేశవాళీ పశువు మృత్యువాత పడితే రూ.15 వేల పరిహారం ఇవ్వాలని నిర్ణయించింది. పథకం అమలుపై ప్రారంభం నుంచే నీలినీడలు కమ్ముకున్నాయి. పశువు మరణించిన వెంటనే పశువైద్యులు బీమా అధికారి సమక్షంలో పంచనామా చేయించి నివేదిక సమర్పించాలి. చనిపోయిన పశువులకు గుంత తీసి పూడ్చాలనే నిబంధన ఉంది. పోస్టుమార్టం చేయించి, గుంత తీసి పూడ్చేందుకు రూ.3 వేల నుంచి రూ.4 వేల వరకు వెచ్చిస్తున్నారు.

అన్నీ రద్దు..

జగన్‌రెడ్డి ప్రభుత్వం వచ్చిన గోకులం, మినీ గోకులం పథకాలను రద్దు చేసింది. వాటిని నిర్మించుకున్న పాడి రైతులకు బిల్లులు నిలిపివేసింది. టీడీపీ హయాంలో దాణామృతం రూ.3 ధరకే అందేది. వైసీఈఎప వచ్చాక రూ.6.50 చేశారు. సబ్సిడీపై గడ్డి ఇవ్వడం లేదు. పశుపోషకులు వరిగడ్డిపైనే ఆధారపడాల్సి వస్తోంది. వరిగడ్డి ట్రాక్టర్ రూ.4 వేల వరకు పలుకుతోంది. దీంతో కొనలేని పరిస్థితి నెలకొంది. ఎండాకాలం పాల దిగుబడి తగ్గడంతో ఆదాయం తగ్గుముఖం పట్టింది. వైసీపీ పాలకుల నుంచి ప్రోత్సాహం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పాడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.1.5 లక్షలు రావాలి



రెండేళ్ల క్రితం అనారోగ్యంతో నాకున్న 40 గొర్రెలు మరణించాయి. పోస్టుమార్టం నిర్వహించడానికి రూ. 5 వేలు పైగానే ఖర్చయింది. రూ. 1.50 లక్షలు బీమా పరిహారం రావాలి. ఇంతవరకు ఒక్క పైసా కూడా అందలేదు. ఇస్తారో లేదో కూడా తెలియడం లేదు.

\- ముత్యాలు, అచ్చంపల్లి, కంబదూరు మండలం



తనకల్లులో గొర్రెలు

పథకం రద్దయ్యింది

వైఎస్‌ఆర్ పశునష్టపరిహార పథకాన్ని మూడునెలల క్రితమే ప్రభుత్వం రద్దు చేసింది. ఆ స్థానంలో బీమా పథకాన్ని తీసుకువచ్చింది. వైఎస్‌ఆర్ బీమా పథకంలోని క్లైయిమ్‌లను ప్రభుత్వం త్వరలోనే చెల్లిస్తుంది. కొత్త ప్రకారం రైతులే ప్రీమియం చెల్లించుకోవాలి.

\- హరినాథ్‌రెడ్డి, పశువైద్యాధికారి, తనకల్లు మండలం

పాడి రైతులను, చిన్నజీవాల కాపరులను ఆదుకోవాలన్న ఉద్దేశంతో తెలుగుదేశం ప్రభుత్వం పశువుల బీమా పథకాన్ని తీసుకు వచ్చింది. గొర్రెలు, మేకలు, పశువులు చనిపోతే బీమా మొత్తాన్ని నేరుగా రైతులకు అందించేవారు. అప్పట్లో ప్రీమియం కూడా ప్రభుత్వమే చెల్లించేది. వైసీపీ అధికారం చేపట్టిన వెంటనే బీమా పథకాన్ని వైఎస్సార్ పశునష్ట పరిహారం అని మార్చారు. తన తండ్రి పేరిట ప్రవేశపెట్టిన పథకాన్ని కూడా ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అమలు చేయలేదు. రైతులు, పశువుల కాపర్లే ప్రీమియం మొత్తాన్ని చెల్లించాల్సి వస్తోంది.

ఒక్క పైసా రాలేదు



పాలు విక్రయించి కుటుంబాన్ని పోషిస్తున్నా. రెండేళ్ల క్రితం పాడి ఆవు మృత్యువాత పడి రూ. 50 వేలు నష్టం వాటిల్లింది. దానికి పోస్టుమార్టం చేయించి పూడ్చడానికి రూ. 3 వేలు ఖర్చయింది. పశు సంవర్ధక శాఖ అధికారులొచ్చి వివరాలు సేకరించారు. ఇప్పటి వరకు పశు నష్ట పరిహారం కింద ఒక్క పైసా రాలేదు. అధికారులను సంప్రదిస్తే సరైన సమాధానం లేదు.

\- జ్యోతి, అచ్చంపల్లి, కంబదూరు మండలం

బీమా ఉన్నట్టా.. లేనట్టా..?



ఐదేళ్లైనా ఒక్క రూపాయి కూడా పరిహారం అందలేదు. పాడి ఆవు మృతితో రూ. 50 వేలు నష్టపోయాను. పశువైద్య సిబ్బంది అన్ని వివరాలు సేకరించినా ప్రయోజనం లేకుండా పోయింది. పశువులకు బీమా ఉన్నట్టా లేనట్టా అనేది తెలియడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పశువుల బీమా పరిహారం చెల్లించాలని కోరుతున్నాం.

\- హుస్సేన్‌పీరా, రాళ్ల అనంతపురం, కంబదూరు మండలం

మూడేళ్లుగా...



మూడేళ్ల క్రితం రెండు పాడి ఆవులు మృతి చెందాయి. సంవత్సరం క్రితం మరో ఆవు మృతి చెందింది. మూడు పశువులు చనిపోవడంతో రూ.2.50 లక్షలు నష్టపోయాను. నష్టపరిహారం కోసం మూడేళ్లుగా ఎదురు చూస్తున్నా ఒక్కరూపాయి అందలేదు. ఎవరిని అడిగినా సమాధానం చెప్పడంలేదు. రైతుల పట్ల ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహించడం సరికాదు.

\- సంజీవరెడ్డి, మునగలవారిపల్లి, గాండ్లపెంట మండలం

ఆవులను అమ్మి...



వైసీపీ ప్రభుత్వం వచ్చాక పాడిపరిశ్రమకు ఎలాంటి ప్రోత్సాహం లేకుండా పోయింది. ఒక ఆవు చనిపోతే దానికి బీమా కూడా ఇవ్వలేదు. పాలకు గిట్టుబాటు ధర లేకుండా పోయింది. పశుపోషణకు దాణా కూడా అందించలేదు. పశువులకు మేత కొనలేక పాడి ఆవులన్నీ అమ్మి కుటుంబ జీవనం కోసం హోటల్ నడుపుకుంటున్నాను.

\- కృష్ణ, ఉప్పరహాళ్ క్రాస్, బొమ్మనహాళ్ మండలం

కష్టంగా మారింది...



పశుపోషణ భారంగా మారింది. ట్రాక్టర్ గడ్డి రూ.4 వేల వరకు పలుకుతోంది. కొనడానికి ఇబ్బందులు పడుతున్నాం. గతంలో గడ్డి విత్తనాలు దొరికేవి. వాటితో పశుగ్రాస క్షేత్రాలు పెంచి పచ్చగడ్డి పశువులకు వినియోగించేవాళ్లం. ప్రస్తుతం ఇవేమీ లేవు. సబ్సిడీ కింద దాణా అందించకపోవడంతో గ్రాసం ఒక్కటే తింటూ పశువులు బక్కచిక్కిపోతున్నాయి.

\- సాంబశివరావు, ఎల్‌బీనగర్, బొమ్మనహాళ్ మండలం

విలువలే ఆస్తిగా..

మూడుసార్లు ఎమ్మెల్యే, మంత్రిగా చేసినా పేదరికమే

ఎన్నికల్లో విరాళాలతోనే పోటీ

రాజకీయాల్లో విలక్షణ నాయకుడు గరుడమ్మగారి నాగిరెడ్డి



ధర్మవరం, ఏప్రిల్ 23: ధర్మవరం రాజకీయాలలో విలువలే ఆస్తిగా బతికిన ప్రజా నాయకుడు గరుడమ్మగారి నాగిరెడ్డి. చేతిలో పదవి ఉన్నా, అభిమానించే ముఖ్యమంత్రి అండదండలున్నా పైసా అవినీతికి తావివ్వని వ్యక్తిత్వం ఆయన సొంతం. మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలిచినా, అనేక మంత్రి పదవులు అనుభవించినా ప్రజాసేవే పరమావధిగా పదవులకు వన్నె తెచ్చిన ప్రజానాయకుడు నాగిరెడ్డి. ఈయన 1983లో ఎన్టీఆర్ పిలుపు మేరకు తెలుగుదేశం పార్టీలో చేరి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం ఎన్టీఆర్ కేబినెట్‌లో మంత్రిగా పని చేశారు. ఈయన ఎన్నికల ప్రచారాలకు అభిమానులే చందాలు వేసుకుని వాహనాలు ఏర్పాటు చేయడంతోపాటు డబ్బులు అందజేసేవారని పెద్దలు చెబుతున్నారు. మంత్రిగా పనిచేసిన కాలంలో తుంపెర డీప్‌కట్ నుంచి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ వరకు పులివెందుల బ్రాంచ్ కెనాల్ తవ్వించడంతోపాటు రామాపురం గ్రామం వద్ద అప్పట్లోనే రూ.2.5కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ కూడా ప్రారంభించారు. దీంతో నార్పల మండంలోని గంగనపల్లి, ముచ్చుకుంటపల్లి, తాడిమర్రి మండలంలోని రామాపురం, కునుకుంట్ల, చిల్లకొండయ్యపల్లి, గుడ్డంపల్లి, పెద్దకోట్ల గ్రామాలు సస్యశ్యామలమయ్యాయి. ధర్మవరం నియోజకవర్గానికి జీవనాడిగా ఉన్న పీఏబీఆర్ కుడికాలువ పనులు కూడా నాగిరెడ్డి హయాంలోనే ప్రారంభించారు. ఈ కాలువ ధర్మవరంతోపాటు బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లోని పలు చెరువులకు నీరందించి రైతులకు నీటికొరతలేకుండా చేస్తోంది. ధర్మవరంలో ఎన్టీఆర్ గృహ పథకం కింద పేదలకు ఒక్కొక్కరికి నాలుగు సెంట్ల స్థలాన్ని పంపిణీచేశారు. గ్రామీణ ప్రాంతాలలో చేతిపంపులు, పాఠశాలలతో పాటు దాడితోట గ్రామ సమీపంలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. తాడిమర్రిలో ఉన్న సబ్‌స్టేషన్‌ను ఆధునికీకరించారు. కాగా నాగిరెడ్డి తాడిమర్రికి వస్తున్నారంటే ఆయనను చూడటానికి తండోపతండాలు వచ్చేవారని చెబుతుంటారు. చివరిసారిగా నాగిరెడ్డి 2004లో సీపీఐ తరపున ధర్మవరం ఎమ్మెల్యే స్థానానికి పోటీ చేసి ఓడిపోయారు. ఆ తరువాత కాలంలో వైసీపీలో చేరారు. కరోనాతో 2021 మే 16న అనంతపురంలో మృతి చెందారు. సాధారణ సర్పంచులే లక్షల రూపాయలు పోగేసుకుంటున్న ఈ కాలంలో నాగిరెడ్డి మాత్రం మంత్రిగా పని చేసినా పైసా సంపాదించుకోకుండా చివరి దశలో పెద్దలు సంపాదించిన భూములు అమ్ముకుంటూ ఆర్థిక ఇబ్బందులతో జీవించాల్సి వచ్చింది.

ఎవరిని నమ్మేది..?

ప్రధాన పార్టీల్లో కోవర్టుల గుబులు

కండువాలు మారుస్తున్న కొందరు నేతలపై అనుమానాలు

పార్టీలు మారుతున్నా కొనసాగుతున్న పాత బంధాలు

హిందూపురం, ఏప్రిల్ 23: ఇది ఎన్నికల కాలం. మరో 18 రోజులు గడిస్తే పోలింగ్. ఇప్పటికే ప్రధాన పార్టీలు తమ ప్రచారాన్ని కొనసాగిస్తూనే పార్టీలో పలువురిని చేర్చుకుంటూ ముందుకు సాగుతున్నాయి. ఈ క్రమంలో ఆయా పార్టీల అభ్యర్థులకు కోవర్టుల భయం పట్టుకుంది. మనోడేలే అని రాజకీయ ఎత్తులు, పై ఎత్తుల గురించి మాట్లాడితే క్షణాల్లో వాటిని ప్రత్యర్థులకు చేరవేస్తున్నారు. ఈ పార్టీ ఆ పార్టీ అని కాకుండా అన్ని పార్టీల్లోను ప్రస్తుతం ఇదే నడుస్తోంది. అయితే ప్రధాన పార్టీల నాయకులు ముందు వరుసలో ఉంటారు. అత్యంత గోప్యంగా ఉంచాల్సిన విషయాలను కూడా తన పక్కన ఎవరున్నారులే అని గమనించకుండా బయటికి పొక్కితే వాటిని క్యాచ్ చేసుకొని క్యాష్ చేసుకుంటున్నట్లు సమాచారం. ఎన్నో ఏళ్ల నుంచి నమ్మిన బంటులా ఉంటున్న అత్యంత సన్నిహితులను సైతం నమ్మలేని పరిస్థితి ఏర్పడింది. ఎన్నికల సందర్భంగా జిల్లాలోని పలు నియోజకవర్గాల్లో ప్రధాన పార్టీలకు కోవర్టుల భయం పట్టుకుంది. తమ బలంతో పాటు బలహీనతలు ప్రత్యర్థులకు చేరుతున్నాయనే అనుమానంతో అభ్యర్థులు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. ప్రత్యర్థి పార్టీ నేతలను తమ పార్టీలోకి లాక్కోవడంతో పాటు తమ పార్టీలో నేతలు ప్రత్యర్థి గూటికి చేరకుండా చూసుకోవడం కత్తిమీద సాములా మారింది. ఎంత జాగ్రత్త పడినా రాత్రి అనుకున్న విషయాలు తెల్లారేలోగా పక్క పార్టీలకు చేరుతున్నాయి. అభ్యర్థుల ప్రచార రంగంలో ఏరోజుకు ఆరోజు షెడ్యూల్ మార్చుకుంటూ వెళుతున్నారు. ఇటీవల ఒక ప్రధాన పార్టీకి చెందిన నాయకులు అభ్యర్థితో కలిసి ఆ పార్టీ ముఖ్యనేత వద్ద కోవర్టు విషయంపై ఫిర్యాదు చేశారు. ఆ నేతలు ఇక్కడ ఉంటే తమకు ఇబ్బంది ఉంటుందని మొరపెట్టుకున్నారు. మరో నియోజకవర్గంలో కూడా రెండు పార్టీల అభ్యర్థులు ఆయా పార్టీల అధిష్టానం దృష్టికి తీసుకెళ్లారు. గోప్యంగా ఉంచుకున్న విషయాలను ప్రత్యర్థి వర్గాలకు చేరుతున్నాయని, ఇలా అయితే తాము పనిచేయలేమని ఆందోళన వ్యక్తం చేసినట్లు సమాచారం. ఒక నియోజకవర్గంలో అధికార పార్టీకి చెందిన అభ్యర్థి ఓ మండల నాయకుడితో ఇదే విషయంపై ఘాటుగా హెచ్చరించిన విషయం చర్చనీయాంశంగా మారింది. ప్రధానంగా గతంలో తమకు పర్సనల్ అసిస్టెంట్లుగా పనిచేసిన వ్యక్తులు ప్రత్యర్థి పార్టీల నేతలతో సఖ్యతగా మెలగడం, పార్టీ మారిన వ్యక్తులతో కోవర్టులుగా వ్యవహరిస్తున్నట్లు తెలిసింది. ఎన్నికల సమయంలో తమ వద్ద అనుచరులుగా, డ్రైవర్లుగా పనిచేసి పక్క పార్టీకి తమ విషయాలు చేరవేస్తూ వెన్నుపోటు పొడుస్తున్నారని కొంత మంది లోలోపల మదనపడుతున్నారు. కొద్ది రోజుల క్రితం ఓ పార్టీకి సంబంధించిన ఓ ఘటన చోటుచేసుకుంది. అది ఎవరికీ తెలియని విషయం. కానీ అది అవతలి వారికి క్షణాల్లో చేరడంతో ఆ పార్టీ ముఖ్యనేతలకు రాత్రంతా నిద్ర లేకుండా చేసింది. పార్టీలో కోవర్టులు ఏ రూపంలో ఉంటారనేది ఎవరికీ అర్థం కానప్పటికీ ప్రధానంగా కొందరి నేతలను అనుమానిస్తున్నారు. ఒక పార్టీ నుంచి మరోపార్టీ గూటికి చేరుతున్న నేతల విషయంలో కూడా కొందరు అభ్యర్థులు జంకుతున్నారు. పార్టీలో ఉంటూ అభ్యర్థులపై అసమ్మతి గళం వినిపిస్తూ వస్తున్న నేతలను సైతం అనుమానిస్తున్నారు. ఏదిఏమైనా ప్రస్తుతం అభ్యర్థులు ఎవరిని నమ్మేది అనే ఆలోచనలో పడ్డారు.



పోస్టల్ బ్యాలెట్ వినియోగం ఇలా..



కళ్యాణదుర్గం, ఏప్రిల్ 23: ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది పోలింగ్ రోజు ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉండదు కాబటి వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. ఎన్నికల విధుల్లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు పోలింగ్ కంటే ముందే తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకుంటారు. ఇందుకోసం ప్రత్యేకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. నియోజకవర్గంలో 850 మం ది పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు.

ఎవరు అర్హులంటే..

ఎన్నికల విధుల్లో ఉండే అధికారులు, సిబ్బంది, పోలీసులు, పాత్రికేయులు పోస్టల్ బ్యాలెట్‌కు అర్హులు. ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులు, ఏపీవో (అదర్ పోలింగ్ ఆఫీసర్స్), ఫ్లైయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేలైన్స్ టీమ్స్ అకౌంటింగ్, సెక్టోరల్ అధికారులు, బీఎల్వోలు, పోలీసు, అత్యవసర సేవల సిబ్బంది తదితరులంతా ఈ పోస్టల్ బ్యాలెట్ పొందేందుకు అర్హులు. వీరికి ఆయా విభాగాల హెడ్‌ల ద్వారా ఫారమ్ 12 దరఖాస్తులు ఇస్తారు. దీనిని పూర్తిచేసి సంబంధిత ఏఆర్‌వోకు పంపించాలి. ఇలా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ఆ ఉద్యోగికి ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పిస్తారు. ఒక ప్రాంతంలో ఓటు ఉండి వేరే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న వారికి సొంత ఊరిలో ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం ఉంది. పోస్టల్ బ్యాలెట్ కోసం ఉద్యోగులకు ప్రత్యేకంగా ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. అక్కడకు వెళ్లి తమ ఓటు హక్కు వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఈ పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తుకు ఈ నెల 26వ తేదీ వరకు గడువు ఉంది.

ఫెసిలిటేషన్ సెంటర్‌లో వినియోగం

గతంలో ఎన్నికల విధుల్లో వుండే అధికారులు, సిబ్బందికి బ్యాలెట్ పేపర్‌ను ఇంటికి పంపేవారు. అక్కడ ఓటు పూర్తి చేసి కవర్‌లో పెట్టి సంబంధిత అధికారికి ఇచ్చేవారు. అయితే కొన్ని చోట్ల ఇది దుర్వినియోగం అవుతుండటంతో కొత్త నిబంధన 18ఏ తెచ్చారు. దీని ప్రకారం ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే వారికి బ్యాలెట్ ఇస్తారు. దీనిని ఇంటికి తీసుకువెళ్లేందుకు అనుమతించరు. ఓటరు ఫెసిలిటేషన్ సెంటర్‌లోనే నచ్చిన అభ్యర్థికి ఓటు వేయాలి. ఆ తరువాత ఆ బ్యాలెట్ పేపర్‌ను, ప్రమాణ పత్రాన్ని జతచేసి కవర్‌లో పెట్టి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పెట్టెలో వేయాలి. పోస్టల్ బ్యాలెట్ వినియోగం మే 4, 5, 6 తేదీల్లో జరగనుంది. ఏ తేదీన, ఏ విభాగం అధికారులు ఓటు వేయాలో ఉన్నతాధికారులు తెలియజేస్తారు. ఆసమయంలో ఆయా అధికారులు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాల్సి ఉంది. ఈపోస్టల్ బ్యాలెట్‌ను ఈవీఎంలతో పాటు లెక్కిస్తారు.

దశాబ్దాల ఘన చరిత

రాజకీయ చైతన్యం కలిగిన గోరంట్ల

పలుమార్లు విభజితమైన నియోజకవర్గం

చివరకు కనుమరుగై పెనుకొండలో కలిసిన వైనం



వెంకటరమణప్ప (ఫైల్)



నిమ్మల కిష్టప్ప

గోరంట్ల, ఏప్రిల్ 23: దశాబ్దాల రాజకీయ చైతన్యం గోరంట్ల ప్రాంతం సొంతం. గోరంట్ల అసెంబ్లీ ఏర్పాటు కాక ముందు హిందూపురం అసెంబ్లీ పరిధిలో ఉండేది. అయితే 1952 ఎన్నికల్లోనే మండలంలోని పులేరు గ్రామానికి చెందిన శివశంకర్‌రెడ్డి హిందూపురం ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. దీన్నిబట్టే గోరంట్ల ప్రాంత రాజకీయ చైతన్యాన్ని అర్థం చేసుకోవచ్చు. గోరంట్ల, చిలమత్తూరు, ఓడీసీ, అమడగూరు మండలాలతో 1957లో గోరంట్ల నియోజకవర్గంగా ఏర్పడింది. ఆ ఎన్నికల్లో వెంకటరమణపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు పూల వెంకటరమణప్ప గెలుపొందారు. ఆయన కాలంలోనే గోరంట్ల పట్టణానికి విద్యుత్ సరఫరా, ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటు జరిగాయి. గోరంట్ల తొలి ఎమ్మెల్యే పూల వెంకటరమణప్ప 2005 డిసెంబరు 1న ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు విషయాలు వివరించారు. అప్పట్లో తన ఎన్నికలకు 6,300 ఖర్చు అయ్యిందన్నారు. తన గెలుపు కోసం స్నేహితులే స్వచ్ఛందంగా ఖర్చులు పెట్టుకుని ప్రచారం చేసినట్లు తెలిపారు. 1962లో చిలమత్తూరు మండలంలోని సోమగట్టకు చెందిన కాంగ్రెస్ అభ్యర్థి బీవీ బయప్పరెడ్డి ఎమ్మెల్యేగా గెలించారు. అనంతరం గోరంట్ల, కొత్తచెరువు, పుట్టపర్తి, బుక్కపట్నం, చిలమత్తూరులోని 7 పంచాయతీలతో కూడి గోరంట్ల నియోజకవర్గం ఏర్పడింది. గోరంట్ల మండలంనుంచి ప్రాతినిధ్యం వహించేవారు లేక బుక్కపట్నం మండలవాసులే గోరంట్ల ఎమ్మెల్యేగా ఎన్నికవుతూ వచ్చారు. టీడీపీ ఆవిర్భావం తరువాత గోరంట్లకు చెందిన నిమ్మల కిష్టప్పకు అవకాశం లభించింది. 1995లో జరిగిన గోరంట్ల ఉప ఎన్నికల్లో నిమ్మల కిష్టప్ప ఘన విజయం సాధించారు. 1999లో కూడా నిమ్మల క్రిష్టప్ప గెలుపొంది రెండు మార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2004 ఎన్నికల్లో నిమ్మల కిష్టప్ప ఓటమిని చవిచూశారు. అనంతరం 2009- 19 మధ్య కాలంలో హిందూపురం ఎంపీగా నిమ్మల పని చేశారు. 2014లో నియోజకవర్గాల పునర్విభజన కారణంగా గోరంట్ల నియోజకవర్గం కనుమరుగైంది. గోరంట్ల మండలాన్ని పెనుకొండ నియోజకవర్గంలో కలిపారు.

ఎట్లయినా గాని..

నామినేషన్‌కు భారీ జన సమీకరణ చేయండి
ప్రస్తుతం ఒక్కొక్కరికి రూ.5 వేలు ఇస్తాం
వైసీపీ గెలిచాక మరింత నగదు నజరానా
వలంటీర్లకు ఎమ్మెల్యే తోపుదుర్తి బంపర్ ఆఫర్
నగర శివారులో రహస్య సమావేశం

రాప్తాడు, ఏప్రిల్ 23: ఎన్నికల్లో గెలుపు కోసం ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి వలంటీర్లకు నగదు ఎర వేస్తున్నారు. తన నామినేషన్‌కు ఎట్లైనా గాని భారీగా జనసమీకరణ చేయాలని ఇప్పటికే వలంటీర్లకు డబ్బుతో ఎరవేశారు. ఒక్కో వలంటీరుకు ప్రస్తుతం కొంత డబ్బు ఇచ్చి నామినేషన్‌కు జన సమీకరణ చేసి, ఎన్నికల ప్రచారం చేయించి గెలిచాక మరోసారి నగదు బహుమతి ఇస్తానని బంపర్ ఆఫర్ ఇచ్చాడు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి అనంతపురం నగర శివారు బెంగళూరు జాతీయరహదారి పక్కన గల ఓ ఫంక్షన్‌హాలులో మంగళవారం రాప్తాడు, ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల వలంటీర్లు దాదాపు 800 మంది, ఆయా మండలాల కొందరు వైసీపీ నాయకులు, రామగిరి, కనగానపల్లి, చెన్నేకొత్తపల్లి మండలాల వైసీపీ నాయకు లతో రహస్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్కో వలంటీరుకు ప్రస్తుతం రూ. 5 వేలు ఇస్తాం. ఆ మొత్తం ఈరోజే బ్యాంకు ఖాతా లేదా స్థానిక నాయకుల ద్వారా మీకు అందజేస్తాం. బుధవారం జరిగే నామినేషన్‌కు భారీగా జనాన్ని పిలుచుకురండి. రాజీనామా చేసి ఎన్నికల ప్రచారం చేయండి. మీ 50 కుటుంబాల ప్రజల వద్దకు వెళ్లి మళ్లీ వైసీపీకే ఓటు వేయాలని చెప్పండి అని తెలిపారు. ఎన్నికల్లో గెలిచిన తరువాత మరోసారి మీకు నగదు బహుమతి అందిస్తా అని వలంటీర్లకు హామీ ఇచ్చాడు. కాగా గత నెల (మార్చి 16)న ఎన్నికల కోడ్ వెలువడటానికి గంట ముందు కూడా రాప్తాడు ఎంపీడీఓ కార్యాలయంలో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి వలంటీర్లతో రహస్యంగా సమావేశం నిర్వహించిన విషయం తెలిసిందే.

గెలిపించండి.. మళ్లీ మీరే కౌన్సిలర్

సమన్వయకర్త భర్త బంపరాఫర్
నేడు జనం తరలింపునకు మల్లగుల్లాలు



హిందూపురం, ఏప్రిల్ 23: నియోజకవర్గంలో వైసీపీకి కొత్తకష్టం వచ్చిపడింది. అదే జన సమీకరణ. టీడీపీ కార్యక్రమాలకు భారీ ఎత్తున జనం వస్తుండడం, వైసీపీ మద్యం, డబ్బు పంచుతున్నా.. ఎవరూ రాకపోవడం ఆ పార్టీలో కలవరం రేపుతోంది. దీంతో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక భర్త వేణురెడ్డి కొత్త ఎత్తు వేశాడు. మున్సిపల్ కౌన్సిలందరికీ బంపరాఫర్ ప్రకటించాడు. 'ఎమ్మెల్యేగా దీపికను గెలిపించుకుంటే.. మిమ్ములను మళ్లీ కౌన్సిలర్లుగా ఏకగ్రీవంగా గెలిపించుకుంటాన'ని కొత్త ప్రతిపాదన తెచ్చారు. వైసీపీ అభ్యర్థి దీపిక నామినేషన్‌కు బుధవారం జనం తరలించేందుకు ముఖ్య నాయకులు, కౌన్సిలర్లతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దీపిక భర్త వేణురెడ్డి.. కౌన్సిలర్లతో అంతర్గత సమావేశంలో మాట్లాడుతూ.. నామినేషన్ కార్యక్రమానికి అధిక సంఖ్యలో జనాన్ని తీసుకురావాలని హుకుం జారీ చేశారు. తమను గెలిపించుకుంటే ఏది అడిగినా చేస్తాననీ, మున్సిపల్ ఎన్నికల్లో రూపాయి ఖర్చు పెట్టనీయకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యేలా చేసుకునే బాధ్యత తనదంటూ ఉచిత ఆఫర్ ఇచ్చినట్లు సమాచారం. టీడీపీ నాయకులను బెదిరించైనా పోటీలో లేకుండా చేస్తానన్నారట. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి నందమూరి బాలకృష్ణ ఈనెల 19న నామినేషన్ వేసిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో 20వేలమందికిపైగా పాల్గొన్నారు. ఈ ర్యాలీని చూసిన జనం ఇక టీడీపీకి హిందూపురంలో తిరుగులేదని చర్చించుకుంటున్నారు. అందుకు తగ్గట్టుగా జనాన్ని రప్పించాలన్న ఆలోచనలో వైసీపీ నాయకులు ఉన్నారు. ఆ మేరకు నాయకులకు ఆదేశాలు ఇచ్చారు. గతంలో వైసీపీ నిర్వహించిన సమావేశాలకు డబ్బు, మద్యం, విచ్చలవిడిగా పంచినా.. జనం రాలేదు. ఈ నేపథ్యంలో నామినేషన్‌కు అధిక సంఖ్యలో తరలించాలని హుకుం జారీ చేయడంతో వైసీపీ నాయకులు ఆందోళన చెందుతున్నారు. తెలుగుదేశం పార్టీకి వచ్చిన జనం వైసీపీకి రాకపోవచ్చని ఆ పార్టీలో చర్చ సాగుతోంది. ఏదిఏమైనా వైసీపీ కౌన్సిలర్లకు ఉచిత బంపర్ ఆఫర్ ప్రకటించడంతో ఆ వార్డుల్లో వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశిస్తున్న వారు డీలాపడ్డారు.

జన కేతనం

ఆంధ్రజ్యోతి

5

అనంతపురం
శ్రీసత్యసాయి

బుధవారం 24 ఏప్రిల్ 2024



కావలి శ్రీనివాసులు నామినేషన్‌ను అందిస్తున్న వైసీపీ నాయకులు రామాంజనేయులు, శ్యాంసుందర్‌రెడ్డి, అంజనేయులు

వైసీపీ చీప్ ట్రిక్స్

శ్రీనివాసులు పేరుతో నామినేషన్లు
కాలవను దెబ్బకొట్టేందుకేనని సంబరాలు

రాయదుర్గం, ఏప్రిల్ 23: తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కాలవ శ్రీనివాసులును దెబ్బతీసేందుకు వైసీపీ చీప్ ట్రిక్స్ మొదలు పెట్టినట్లు చర్చ జోరుగా సాగుతోంది. మంగళవారం నామినేషన్ల దాఖలు వ్యవహారంలో కాలవ శ్రీనివాసులు పేరు కలిగిన కొందరితో నామినేషన్ దాఖలు చేయించినట్లు తెలిసింది.



నామినేషన్‌ను అందిస్తున్న కురుబ శ్రీనివాసులుతో పాటు మెట్టు గోవిందరెడ్డి సహాయకుడు బసవరాజు

రాయదుర్గం మండలంలోని బీఎన్ హళ్లికి చెందిన శ్రీనివాసులు కావలి, కణేకల్లు మండలం యర్రగుంటకు చెందిన కురుబ శ్రీనివాసులు, రాయదుర్గం మండలం కాశీపురానికి చెందిన కావలి శ్రీనివాసులుతో నామినేషన్‌లు దాఖలు చేయించారు. వైసీపీ నాయకులు దగ్గరుండి ఇండిపెండెంట్ అభ్యర్థుల నామినేషన్‌లు వేయించడంతో వైసీపీ చీప్ ట్రిక్స్ బయటపడ్డాయి. ఈవీఎంలపై శ్రీనివాసులు అనే వ్యక్తుల పేర్లు ఎక్కువగా కనిపిస్తే ఓటర్లు తికమక పడి కాలవ శ్రీనివాసులుకు వేయాల్సిన ఓట్లను మరో శ్రీనివాసులుకు వేస్తారనే భావనతో ఆ పేరుగల వ్యక్తులతో నామినేషన్లు వేయించినట్లు తెలుస్తోంది. తెలుగుదేశం పార్టీని ఎదుర్కోలేక అడ్డదారులు వెదుకుతు న్నారని ఆ పార్టీ వర్గాలు విమర్శిస్తున్నాయి. ఇప్పటికే ముగ్గురు వ్యక్తులతో నామినేషన్లు వేయించడంతో టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులకు పడే ఓట్లు చీల్చగలమని వైసీపీ నాయకులు సంబరపడుతున్నట్లు సమాచారం.

హోం ఓటింగ్‌కు రాం.. రాం..

- 35,925 మందికి గాను 1304 మందే దరఖాస్తు
- ఎన్నికల సిబ్బంది పోస్టల్‌బ్యాలెట్‌కు సగం మందే..
- 23,900 మందికిగాను 11,470 దరఖాస్తులు
- హోం ఓటింగ్‌కు ముగిసిన గడువు
- ఎన్నికల సిబ్బందికి 28వరకు అవకాశం

అనంతపురం టౌన్, ఏప్రిల్ 23: నడవలేని స్థితిలో ఉన్న 85 ఏళ్ల పైబడిన వయోవృద్ధులతో పాటు దివ్యాంగులకు ఈసారి ఇంటివద్దే ఓటు వేసేందుకు ఎన్నికల కమిషన్ అవకాశం కల్పించింది. ఓటుశాతం పెంచడమే లక్ష్యంగా కమిషన్ ఈ నిర్ణయం తీసుకున్నా జిల్లాలో ఆ మేరకు స్పందన కనిపించలేదు. జిల్లా వ్యాప్తంగా హోం ఓటింగ్‌కు 35,925 మంది అర్హులుగా ఉన్నట్లు అధికారులు గుర్తించారు. హోం ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు చెబుతున్నా ముందుకు రాలేదు. వయోవృద్ధులు 9,828 మందికి గాను కేవలం 611 మంది, దివ్యాంగులు 26,097మందికి గాను 693 మంది మాత్రమే హోం ఓటింగ్ వేయడానికి ఫారం-12డీ దరఖాస్తు చేసుకున్నారు. ఈ లెక్కన వృద్ధులు, దివ్యాంగులు కలిపి 1303 మంది మాత్రమే తొలిసారి హోంఓటింగ్‌కు ఆసక్తి చూపించారు. రాయదుర్గం నియోజకవర్గంలో వయోవృద్ధులు 76 మంది, దివ్యాంగులు 134 మంది, ఉరవకొండ నియోజకవర్గంలో వృద్ధులు 41మంది, దివ్యాంగులు 42 మంది, గుంతకల్లులో వృద్ధులు 133 మంది, దివ్యాంగులు 143 మంది, తాడిపత్రిలో 1071 మంది వృద్ధులకు 27మంది, 4148 మంది దివ్యాంగులకుగాను 26మంది, శింగనమల నియోజకవర్గంలో 1236 మంది వృద్ధులకు గాను 147 మంది, 1758 మంది దివ్యాంగులకు గాను 56 మంది, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 842 మంది వృద్ధులకు గాను 51 మంది, 3094 మంది దివ్యాంగులకు గాను 70 మంది, రాప్తాడు నియోజకవర్గంలో 1137 మంది వృద్ధులకు 83 మంది, 4128 మంది దివ్యాంగులకుగాను 130మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఈ లెక్కలు చూస్తుంటే హోం ఓటింగ్ పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారా.. కాక పోతే అధికారులు పూర్తిగా అలసత్వం వహించారా అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

పోస్టల్ బ్యాలెట్లకు సగం మందే దరఖాస్తు

ఉద్యోగ, ఉపాధ్యాయులు సైతం సగం మందే పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు చెబుతున్న మేరకు జిల్లాలో 23,900 మంది ఎన్నికల విధుల్లో ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొంటున్నారు. వీరందరు పోస్టల్‌బ్యాలెట్ ద్వారానే తమ ఓటుహక్కును వినియోగించుకోవాల్సి ఉంటుంది. ఇక్కడ కూడా పోస్టల్ బ్యాలెట్ల కోసం ఇప్పటి వరకు 11,470 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో రాయదుర్గం నియోజకవర్గంలో 2,639 మందికి గాను 1723 మంది, ఉరవకొండ నియోజకవర్గంలో 3047 మందికి గాను 1136మంది, గుంతకల్లు నియోజకవర్గంలో 3397మందికి గాను 1662మంది, తాడిపత్రి నియోకవర్గంలో 2570 మందికి గాను 1028 మంది, అనంతపురంఅర్బన్ నియోజకవర్గంలో 3,240 మందికి గాను 2,942 మంది, కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 2567మందికి గాను 1294మంది, రాప్తాడు నియోజకవర్గంలో 2800మందికి గాను 716 మంది మాత్రమే ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలు పోస్టల్ బ్యాలెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఈనెల 28 వరకు పోస్టల్ బ్యాలెట్‌కు దరకాస్తు చేసుకోవడానికి అవకాశం ఉంది.

కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు

అనంతపురం టౌన్, ఏప్రిల్ 23: ఎన్నికల నేపథ్యంలో ఫిర్యాదులు స్వీకరించడం, సమాచారంను తెలుసుకోవడం కోసం జిల్లా, నియోజకవర్గ స్థాయిలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం ఓప్రకటనలో తెలిపారు. ఎక్కడ ఏమి జరిగినా ఫోన్ చేసి కంట్రోల్‌రూంకు ఫిర్యాదు చేయవచ్చన్నారు. జిల్లా కమాండ్ కంట్రోల్ రూమ్ నెంబరు 18004258802, 08554-234122, 1800428803, 08554-239822, 18004258803, 08554-231722, అసెంబ్లీ నియోజకవర్గాల వారిగా రాయదుర్గం 8495252001, ఉరవకొండ 8496357846, గుంతకల్లు 85522 23355, తాడిపత్రి 96423 38578, శింగనమల 8919003100, అనంతపురం అర్బన్ 08554 230139, కళ్యాణదుర్గం 08497-220422, రాప్తాడు 85542 91001 నెంబర్లకు ఫోన్ చేయవచ్చన్నారు. ఈకంట్రోల్ రూమ్ నెంబర్లు 24 గంటలపాటు అందుబాటులో ఉంటాయని ఎవరైనా ఫిర్యాదులు చేయవచ్చని, వాటిని వెంటనే పరిశీలింపజేసి పరిష్కరిస్తామని కలెక్టరు వినోద్ కుమార్ తెలిపారు.

రాయలు ఏలిన దుర్గం

నియోజకవర్గ చరిత్ర

- వ్యవసాయం, పరిశ్రమలతో ఉపాధి
- గార్మెంట్స్ తయారీలో ప్రత్యేకత
- ఓబుళాపురం గనులతో గుర్తింపు
- మహిళా ఓటర్లే అధికం



ఒకప్పుడు పాలెగాళ్లు పాలించిన రాయదుర్గం నియోజకవర్గం విభిన్నమైన సంస్కృతులు, ఆచారాల మేళవింపుగా ఉంటుంది. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో ఉండడంతో తెలుగు, కన్నడ సంప్రదాయాలు కొనసాగుతున్నాయి. ఒక ప్రాంతంలో గార్మెంట్స్ పరిశ్రమ, వ్యవసాయంతో ఉపాధి లభిస్తుండగా.. మరోవైపు ఇసుక మేటలు కప్పేసి కరువు తాండవిస్తుంటుంది. ఇంకోవైపు ఓబుళాపురం గనులతో జాతీయ గుర్తింపు వచ్చింది. భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాల మళ్లింపు, హంద్రీనీవా ద్వారా 25 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు, ఉంతకల్లు రిజర్వాయర్ నిర్మాణం, ఎడారి నివారణ, హెచ్చెల్సీ ఆధునికీకరణ వంటి సమస్యలు ఎన్నికల హామీలుగానే మిగిలిపోతున్నాయి.

రాయదుర్గం, ఏప్రిల్ 23: పూర్వం పాలెగాళ్లు రాయదుర్గం కోటను పాలించేవారు. పాలెగాళ్లపై యుద్ధం చేసిన విజయనగర రాజులు వారిని ఓడించి విజయనగర సామ్రాజ్యంలో అంతర్భాగంగా చేసుకున్నారు. వారి సామ్రాజ్యంలో తిమ్మరుసు తమ్ముడు గోవిందరాయ మాత్యుడిని సామంతరాజుగా నియమించారు. అనంతరం టిప్పుసుల్తాన్ దండయాత్ర చేసి దుర్గంను ఆక్రమించాడు. టిప్పుసుల్తాన్, బ్రిటిష్ వారితో కుదుర్చుకున్న ఒప్పందం మేరకు ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో రాయదుర్గాన్ని దత్త మండలంగా చేర్చారు. భాషా ప్రాతిపదికన ఆంధ్రరాష్ట్రం ఏర్పడినప్పుడు అనంతపురం జిల్లాలో చేర్చి రాయదుర్గంను నియోజకవర్గంగా ఏర్పాటు చేశారు. గుమ్మఘట్ట మండలం భైరవానితిప్ప డ్యాం, కణేకల్లులోని చిక్కణ్ణేశ్వర చెరువులు సాగునీరు అందిస్తున్నాయి. బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో తుంగభద్ర ఎగువకాలువ కింద వేల ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. వేదావతి హగరి నది ఒడ్డును ఇసుకమేటలు విస్తరించివున్నాయి. డి.హీరేహాళ్ మండలంలో ఓబుళాపురం, సిద్ధాపురం, మలపనగుడి గ్రామాల్లో ఇనుప కొండలు విస్తరించివున్నాయి. స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీలు ఏడు దాకా వున్నాయి. రాయదుర్గంలో గార్మెంట్స్ పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వారి సంఖ్య ఎక్కువే. డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు ఉన్నాయి. వీరాపురం వద్ద ఐదు మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే సోలార్ కేంద్రం నియోజకవర్గంలో ప్రముఖంగా వున్నాయి. రాయదుర్గంలో ఇటీవల రైల్వే జంక్షన్‌ను కూడా అభివృద్ధి చేశారు. అభివృద్ధిలో చివరి స్థానంలో ఉంది. గతంలో ఏ శాసనసభ్యుడు చేయని రీతిలో టీడీపీ హయాంలో మంత్రిగా పనిచేసిన కాలవ శ్రీనివాసులు ప్రత్యేక ముద్ర పడే విధంగా శాశ్వతమైన సమస్యలను పరిష్కరించే ప్రయత్నం చేశారు.

రాజకీయ చరిత్ర

కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో వుండి కన్నడ సంస్కృతి, సంప్రదాయాలకు అలవాటు పడ్డ రాయదుర్గం నియోజకవర్గ ఓటర్ల నాడి అంతుచిక్కనిది. 1952లో ఏర్పడిన రాయదుర్గం నియోజకవర్గంలో ఇప్పటి వరకు 17సార్లు ఎన్నికలు జరిగాయి. 1953 వరకు బళ్లారి జిల్లాలో వున్న రాయదుర్గం తాలూకా ఆంధ్రరాష్ట్ర అవతరణతో అనంతపురం జిల్లాలో చేరింది. కాంగ్రెస్ పార్టీకి ఆది నుంచి కంచుకోటగా వుంటున్న ఈ నియోజకవర్గంలో 1967లో జె. తిప్పేస్వామి, 1983లో పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి స్వతంత్ర అభ్యర్థులుగా బరిలో దిగి గెలిచి రికార్డు సృష్టించారు. 1952లో తొలిసారిగా జరిగిన ఎన్నికల్లో జి. నాగభూషణం కాంగ్రెస్ నుంచి గెలిచారు. 1983లో స్వతంత్రంగా గెలిచిన పాటిల్ వేణుగోపాల్‌రెడ్డి 1989, 1999లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 17 సార్లు ఎన్నికల్లు జరిగితే అందులో పది సార్లు కాంగ్రెస్ పార్టీ గెలిచింది. నియోజకవర్గంలో రాయదుర్గం, కణేకల్లు, బొమ్మనహాళ్, డి.హిరేహాళ్, గుమ్మఘట్ట మండలాలు ఉన్నాయి.

జీన్స్ పరిశ్రమ జీవనాధారం

రాయదుర్గం నియోజకవర్గంలో జీన్స్ పరిశ్రమపై ఆధారపడి 20 వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. గతంలో చేనేత వృత్తిని నమ్ముకుని మగ్గాలు వేసుకుని చీరలను తయారు చేసేవారు. క్రమేపీ మారుతున్న కొద్ది జీన్స్ వైపు మళ్లి ప్యాంట్ల తయారీనే ప్రధాన వృత్తిగా మార్చుకున్నారు. తమిళనాడు, కేరళ, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. కరోనా సమయంలో జీన్స్ పరిశ్రమ కుప్పకూలిపోతే ప్రత్యామ్నాయంగా సర్జికల్ మాస్కులను తయారు చేసి ఉపాధి పొందారు.

మహిళా ఓటర్లే అధికం

రాయదుర్గం నియోజకవర్గంలో 3.74 లక్షల జనాభా వుండగా అందులో 48.64 శాతం అక్షరాస్యత వుంది. నియోజకవర్గంలో వున్న ఐదు మండలాల్లో 2,61,089 మంది ఓటర్లు వుండగా పురుషులు 1,29,181 మంది, మహిళలు 1,31,873, థర్డ్ జెండర్ 35 మంది వున్నారు. ఎన్నికల నిర్వహణ కోసం 296 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో 77 రెవెన్యూ గ్రామాలు, 94 గ్రామ పంచాయతీలు రాయదుర్గం మున్సిపాలిటీ, కణేకల్లు మేజర్ గ్రామ పంచాయతీలు వున్నాయి.

తొలి ఎమ్మెల్యేగా స్వాతంత్ర్య సమరయోధుడు

1952లో జరిగిన తొలి ఎన్నికల్లో స్వాతంత్ర్య సమరయోధుడు గురుమాళ్ నాగభూషణం విజయం సాధించారు. వృత్తిరీత్యా న్యాయవాదిగా వున్న ఆయన స్వాతంత్ర్యం కోసం పోరాడి కర్ణాటక రాష్ట్రం బీజాపూర్ జిల్లాలోని ఇండలిగ్ జైలులో ఆరు నెలలు జైలు జీవితాన్ని గడిపారు. రాయదుర్గం పట్టణానికి చెందిన ఆయన హరిజనుల ఆలయ ప్రవేశం కోసం ఉద్యమాన్ని నిర్వహించారు. స్వతంత్ర అభ్యర్థిగా పోటి చేసి గెలిచిన కొద్ది రోజుల అనంతరం బళ్లారి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడిగా పనిచేశారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్లు కావడంతో ఇటీవల కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆజాదికా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా గురుమాళ్ నాగభూషణం పేరుతో ఫిలాటికల్ పోస్టల్ కవర్‌ను విడుదల చేసింది.




నాగభూషణం

ప్రభావిత ఓటరు వర్గాలు

రాయదుర్గం నియోజకవర్గంలో అత్యధికంగా వాల్మీకులు వున్నారు. ఆ తర్వాతి స్థానంలో ఎస్సీలు, ముస్లింలు, కురుబ, యాదవులు ఉన్నారు. ముఖ్యంగా నియోజకవర్గంలోని ఐదు మండలాల ఓటర్ల తీర్పు ఎలా ఉన్నా రాయదుర్గం పట్టణంలోని ఓటర్ల తీర్పే ప్రతి ఎన్నికల్లో అభ్యర్థి గెలుపుపై ప్రభావం చూపుతోంది. ఇప్పటి వరకు గెలుపొందిన తెలుగుదేశం పార్టీ అభ్యర్థులంతా రాయదుర్గం పట్టణంలో వచ్చిన మెజార్టీ కారణంగా గెలిచిన వారే. రాయదుర్గం పట్టణంలో చేనేత వర్గం, ముస్లింల ప్రభావం గెలుపోటములను నిర్దేశిస్తుంది.


ప్రధాన సమస్యలు



నియోజకవర్గంలో ప్రధాన సమస్యలు కొన్ని ఏళ్లు పరిష్కారానికి నోచుకోలేకపోతున్నాయి. భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణా జలాల మళ్లింపు. హంద్రీనీవా 34,36వ ప్యాకేజీ ద్వారా 25 వేల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడం, బొమ్మనహాళ్ మండలంలోని ఉంతకల్లులో రిజర్వాయర్ నిర్మాణం, ఎడారి నివారణ కోసం ఇసుక విస్తరించకుండా మొక్కల పెంపకం, హెచ్చెల్సీ ఆధునికీకరణ పనులు, గోనబావిలో రూ. 40 కోట్లతో చేపట్టిన బీసీ గురుకుల పాఠశాల నిర్మాణం, బాలికల జూనియర్ కళాశాల పక్కాభవనం, టెక్స్‌టైల్స్ పార్కులో యూనిట్ల ఏర్పాటు, సీఎ[illegible]ఎఫ్‌సీ సెంటర్ ప్రారంభంతో నిరుద్యోగ యువతకు శిక్షణ, రాయదుర్గం పట్టణంలో పుట్టప్పతోట డిస్పోజల్ డ్రైన్ నిర్మాణం లాంటి పనులు జరగాల్సి వున్నాయి. అదేవిధంగ కణేకల్లులో డిగ్రీ కళాశాల నిర్మించాల్సి వుంది.

ప్రముఖ ప్రదేశాలు

బొమ్మనహాళ్ మండలంలోని నేమకల్లు ఆంజనేయ స్వామి దేవస్థానం, డి.హీరేహాళ్ మండలంలోని మురడీ ఆంజనేయస్వామి దేవస్థానాలు ప్రముఖమైనవి. రాయదుర్గం పట్టణంలో వున్న దశభుజగణపతి దేవాలయానికి ప్రత్యేకత వుంది. రాయదుర్గం కొండపై ఉన్న కోట, పట్టాభిరామస్వామి దేవాలయం, మాధవరాయ స్వామి దేవాలయాలు, సిద్ధుల కొండపై ఉన్న జైనుల విశ్వవిద్యాలయం ప్రముఖమైనవి. డి. హీరేహాళ్ మండలంలోని గవిసిద్దేశ్వర దేవాలయం ప్రత్యేకత ఉంది. రాయదుర్గం మండలంలోని చదం గ్రామం వద్ద గల పశుపతినాథుని దేవాలయం, రాయదుర్గం పట్టణంలోని పాదరస లింగం కూడా దేశంలో ప్రఖ్యాతి గాంచింది. జీన్స్ ప్యాంట్లు తయారు చేసే టెక్స్‌టైల్ పార్కు, కణేకల్లులో వరి వంగడాలు అందించే ఉత్పత్తి కేంద్రం బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లో విస్తరించిన ఎడారి ఇసుక మేటలు, గుమ్మఘట్ట మండలంలోని బీటీ ప్రాజెక్టు పర్యటక కేంద్రాలుగా చెప్పుకోవచ్చు.



కరువుకు ఆనవాళ్లు ఇక్కడే

అత్యల్ప వర్షపాతం నమోదయ్యే అనంతపురం జిల్లాలో కరువు ఆనవాళ్లు మాత్రం ఇక్కడే కనిపిస్తాయి. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో రెండు వేల హెక్టార్లకు పైగా విస్తీర్ణంలో ఇసుకమేటలు విస్తరించాయి. వేదావతి హగరి నది పరివాహక ప్రాంతంలో విస్తరించిన వీటిని శాస్త్రవేత్తలు అధ్యయనం చేసి జిల్లాలో కరువు ఛాయలు ఇక్కడే ప్రారంభమయ్యాయని నిర్ధారించారు. వీటిని కట్టడి చేయడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేసినా అంతగా సత్ఫలితాలు ఇవ్వడం లేదు. దీని ప్రభావానికి లోనైన 10 గ్రామాలు ప్రతియేటా ఆషాఢమాసంలో వీచే గాలులకు తీవ్ర అవస్థలు పడుతుంటాయి.

సంవత్సరం	విజేత	పార్టీ	ప్రత్యర్థి	పార్టీ	ఆధిక్యం
1952	జి. నాగభూషణం	కాంగ్రెస్	కేసీబీ చౌదరి	ఇండిపెండెంట్	6238
1955	శేషాద్రి	కాంగ్రెస్	పయ్యావుల కేశవన్న	ఇండిపెండెంట్	2050
1962	లక్కా. చిన్నపరెడ్డి	కాంగ్రెస్	ఎంపీ లక్ష్మీపతి	ఇండిపెండెంట్	1412
1967	తిప్పేస్వామి	ఇండిపెండెంట్	లక్కా. చిన్నపరెడ్డి	కాంగ్రెస్	5316
1972	తిప్పేస్వామి	కాంగ్రెస్	కేకే తిమ్మప్ప	ఇండిపెండెంట్	16,559
1975	(ఉ.ఎ)	కాంగ్రెస్	కె. రంగప్ప	ఇండిపెండెంట్	18,080
1978	వెంకటనారాయణ కేబీ చిన్నమల్లప్ప	కాంగ్రెస్	యు. లింగారెడ్డి	జనతా	5,228
1983	వేణుగోపాల్‌రెడ్డి	ఇండిపెండెంట్	కె. గోవిందప్ప	టీడీపీ	3,381
1985	హులికుంటప్ప	కాంగ్రెస్	యు లింగారెడ్డి	జనతా	7189
1989	వేణుగోపాల్‌రెడ్డి	కాంగ్రెస్	కె. గోవిందప్ప	టీడీపీ	8550
1994	హులికుంటప్ప	టీడీపీ	వేణుగోపాల్‌రెడ్డి	కాంగ్రెస్	20,733
1999	వేణుగోపాల్‌రెడ్డి	కాంగ్రెస్	పి. జితేంద్రప్ప	టీడీపీ	9,235
2004	ఎం. గోవిందరెడ్డి	టీడీపీ	వేణుగోపాల్‌రెడ్డి	కాంగ్రెస్	10,105
2009	కాపు రామచంద్రారెడ్డి	కాంగ్రెస్	ఎం గోవిందరెడ్డి	టీడీపీ	14,091
2012	(ఉ.ఎ) కాపు రామచంద్రారెడ్డి	వైసీపీ	దీపక్‌రెడ్డి	టీడీపీ	32,476
2014	కాలవ శ్రీనివాసులు	టీడీపీ	కాపు రామచంద్రారెడ్డి	వైసీపీ	1,831
2019	కాపురామచంద్రారెడ్డి	వైసీపీ	కాలవశ్రీనివాసులు	టీడీపీ	14,049

ఉద్యాన పంటల సాగులో ప్రత్యేకత



వర్షాధారం కింద అత్యధిక భూభాగంలో వేరుశనగ సాగు చేస్తారు. దీనికి దీటుగా ఉద్యాన పంటలపై కూడా ఇక్కడి రైతాంగానికి మక్కువ ఎక్కువ. దానిమ్మ, అరటి, ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్, లిచ్చి, సపోట, జామ, అల్లనేరేడు, ఉల్లి, టమోట, ఖర్బూజా, పుచ్చకాయ పంటలను సాగు చేస్తారు. ఇక్కడి నుంచి విదేశాలకు కూడా ఎగుమతి చేస్తారు. కొత్త పంటల ప్రయోగం చేయడంలో రైతులు ఎక్కువ ఆసక్తి చూపుతారు. వర్షాధారం కింద వేరుశనగ, కంది, ఆముదం, ఉలవ సాగు చేస్తారు. కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో తుంగభద్ర ఎగువ కాలువ వుండటంతో వరిసాగు అధికంగా జరుగుతుంది. రైతు కూలీల సంఖ్య అధిక శాతం వుండటంతో వ్యవసాయ సీజన్ కాగానే బెంగళూరుకు వలసలు వెళ్లి ఉపాధి పొందుతారు.

కర్ణాటక రాజకీయాల్లో రాయదుర్గం ముద్ర

రాయదుర్గం నియోజకవర్గానికి చెందిన కొందరు కర్ణాటక రాజకీయాల్లో రాణించారు. డి.హీరేహాళ్ మండలంలోని ఎం.హనుమాపురం గ్రామానికి చెందిన నారా సూర్యనారాయణరెడ్డి కురుగోడు ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయన తనయుడు నారా భరత్‌రెడ్డి ప్రస్తుతం బళ్లారి నగర కాంగ్రెస్ ఎమ్మెల్యేగా వున్నారు. అదేగ్రామానికి చెందిన బసవరాజేశ్వరి బళ్లారి ఎంపీగా పలుసార్లు కాంగ్రెస్ నుంచి గెలిచారు. డి.హిరేహాళ్‌కు చెందిన హెచ్‌ఆర్‌జీ రాములు కొప్పళ ఎంపీగా గెలిచారు. కణేకల్లు మండలం హనకనహాళ్ గ్రామానికి చెందిన బి.నారాయణరెడ్డి, బి.గురునాథరెడ్డి అనంతపురం ఎమ్మెల్యేలుగా కొనసాగారు.

నాగలింగేశ్వరుడి సెంటిమెంట్

ఏ పార్టీ నేతలు అయినా
ఈ గుడిలో పూజలు చేశాకే ప్రచారం

ఎన్నికల్లో గెలవాలంటే నాగేలింగేశ్వర స్వామి ఆశీస్సులుండాలన్న సెంటిమెంట్ శింగమల నియోజకవర్గంలో ఉంది. పోటీలో నిలిచే అభ్యర్థులెవరైనా సరే బుక్కరాయసముద్రం మండలం నీలంపల్లిలోని నాగేలింగేశ్వరస్వామి ఆలయంలో పూజల నిర్వహించి ముందుకు పోతే విజయం తథ్యమన్న నమ్మకం కొన్నేళ్లుగా ఉంది. తొలుత అనంతపురం మాజీ ఎమ్మెల్యే బి నారాయణరెడ్డి, వారి కుటుంబ సభ్యులు నీలంపల్లి గ్రామంలోని నాగలింగేశ్వర స్వామి దేవాలయం నుంచి పూజలు నిర్వహించి ఎన్నికల ప్రచారం మొదలుపెట్టాడు. అప్పటి నుంచి టీడీపీ, కాంగ్రెస్ అభ్యర్థులంతా ఇదే దేవాలయం లో పూజలు చేసిన తర్వాత ప్రచారం మొదలుపెట్టడం అనవాయితీగా మారింది. ప్రస్తుతం పోటీ చేస్తున్న టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ, వైసీపీ అభ్యర్థి వీరాంజనేయులు సైతం ఇదే దేవాలయంలో తొలి పూజ నిర్వహించి ప్రచారం ప్రారంభించిన విషయం తెలిసిందే.

- బుక్కరాయసముద్రం





రైతులను ఆదుకుంటాం. తమది రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనా కాలంలో సబ్సిడీపై ఇచ్చే బిందు, తుంపర్ల పరికరాలకు మంగళం పాడాడు. కరువు జిల్లాలో అరకొరగా ఉన్న నీటి వసతితో పంటలు సాగుచేయడానికి ఈ పరికరాలు ఎంతో ఉపయోగపడేవి. అవసరం ఎంతోమంది రైతులు వీటికోసం నేటికి ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వ సాయం లేకపోవడంతో అప్పులు చేసి బహిరంగ మార్కెట్‌లో పరికరాలు కొనలేక, పంటలు సాగు చేయలేక సతమతమవుతున్నారు.

బిందు, తుంపర పరికరాలేవీ జగనన్నా?

- నంబులపూలకుంట

నేటి నామినేషన్ మహోత్సవానికి తరలిరండి

సైకో పాలన పోవాలని రాష్ట్రమంతా ఎదురుచూస్తోంది : కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్




జోగి రాజేంద్ర ఆధ్వర్యంలో టీడీపీలోకి చేరిన విశ్వబ్రాహ్మణులు, పోతుల లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో టీడీపీలో చేరిన హరిజన కాలనీ వైసీపీ నాయకులు, కార్యకర్తలు

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 23 : తాను, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ బుధవారం నామినేషన్ వేస్తున్నామని, ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కూటమి అనంత అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. మంగళవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంత అర్బన్ టీడీపీ కార్యాలయంలో అనంత అర్బన్ పరిశీలకులు రమణారెడ్డితో కలిసి ఆయన మాట్లాడారు. ఉదయం 9 గంటలకు శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయం నుంచి నామినేషన్ మహోత్సవ ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. రాం నగర్ ఫ్లైఓవర్, అంబేడ్కర్ సర్కిల్, సప్తగిరి సర్కిల్, పాతూరు మీదుగా ర్యాలీ కొనసాగుందన్నారు. నామినేషన్ మహోత్సవమే తన విజయానికి తొలి మెట్టు అవుతుందన్నారు. రాష్ట్ర ప్రజలంతా సైకో పాలన సాగనంపేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో పలువురు నాయకులు దగ్గుబాటిప్రసాద్ సమక్షంలో టీడీపీలో చేరారు. 49వ డివిజన్‌కు చెందిన మాజీ కార్పొరేటర్ భూలక్ష్మీ, ఆమె కుమారుడు పవన్‌కుమార్ టీడీపీలో చేరారు. బీసీ సంఘం నాయకుడు జోగి రాజేంద్ర ఆధ్వర్యంలో 30 మంది విశ్వబ్రాహ్మణులు టీడీపీలో చేరారు. టీఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పోతుల లక్ష్మీనరసింహులు ఆధ్వర్యంలో 10వ డివిజన్ ఎస్సీ కాలనీకి చెందిన 50 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. 20వ డివిజన్‌కు శివరుద్రయ్య ఆధ్వర్యంలో టీడీపీ డాక్టర్ సెల్ రాష్ట్ర కార్యదర్శి పీఎం లక్ష్మీప్రసాద్ సమక్షంలో 200 మంది పార్టీలో చేరారు.

నగరంలో విస్తృత ప్రచారం

నగరంలోని పలు డివిజన్లల్లో స్థానిక టీడీపీ నాయకులు విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. స్థానిక 23, 26వ డివిజన్ల పరిధిలోని శరదా నగర్, ఫెర్రర్ నగర్, హమాలీ కాలనీ తదితర ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్ బల్లా పల్లవితో కలిసి దగ్గుబాటి సతీమణి శ్రీలక్ష్మి ప్రచారం నిర్వహించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్ ఆధ్వర్యంలో రెండో డివిజన్ భాగ్యనగర్‌లో ప్రచారం చేశారు. 13వ డివిజన్‌లో టీడీపీ కురబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ కురబ నారాయణస్వామి, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని ఆధ్వర్యంలో 42వ డివిజన్‌లో, టీడీపీ బెస్త సాధికార రాష్ట్ర కమిటీ సభ్యులు చేపల హరి ఆధ్వర్యంలో 39వ డివిజన్‌లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివశంకర్, లక్ష్మన్న, రుద్ర శేఖర్, శివ, భాస్కర్, శివాజీ, హాజీపీరా, బార్గవ్ ప్రసాద్, అనిల్ పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన మాజీ కార్పొరేటర్ భూలక్ష్మి, ఆమె అనుచరులతో దగ్గుబాటి ప్రసాద్

నారాయణపురంలో ప్రచారం

అనంతపురంరూరల్: నారాయణపురం పంచాయతీ పరిధిలోని సోమనాథ్‌నగర్, ప్రియాంకనగర్‌లో దుగ్గుబాటి విస్తృత ప్రచారం నిర్వహించారు. ఇందులో నియోజకవర్గ పరిశీల కుడు రమణారెడ్డి, టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్య దర్శి ఆదెన్న, మాజీ మున్సిపల్ చైర్మన్ నూర మహ మ్మద్, కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ రాయల్ మురళి, స్టోర్ బాల, మునీంద్ర, విజయబాబు, హాజీ, హరి, వెంకటరాముడు, చలం, రంగబాబు, అఖిలేష్, నాగార్జున పాల్గొన్నారు.

రాప్తాడు అభివృద్ధి పరిటాలతోనే సాధ్యం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 23: రాప్తాడు నియోజకవర్గ అభివృద్ధి పరిటాల సునీతతోనే సాధ్యమని పరిటాల కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సిండికేట్ నగర్‌లో పరిటాల శ్రీరామ్ సతీమణి పరిటాల జ్ఞాన.. పరిటాల రవి సోదరి ఉష కక్కలపల్లి కాలనీ, కక్కలపల్లిలో పరిటాల శైలాజ ప్రచారం నిర్వహించారు. ముగ్గురు ఆయా ప్రాంతాల్లో స్థానిక నాయకులతో కలసి ఇంటింటా ప్రచారం చేపట్టారు. రాప్తాడులో భయానక పరిస్థితులు పోవాలంటే మళ్లీ పరిటాల సునీతను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ జింకా సూర్యనారాయణ, గ్రామ కమిటీ అధ్యక్షుడు మంజునాథ్, నాయకులు నాగరాజు, అల్లీపీరా, సర్దానప్ప, ఎర్రిస్వామి, రాజేష్, ఓబుళపతి, బుల్లెట్ రఫీ, కక్కలపల్లి మాజీ సర్పంచు లక్ష్మీనరసమ్మ, మాజీ ఎంపిటీసీ నారాయణస్వామి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

ధర్మవరంరూరల్: కనగానపల్లి మండలంలోని మామిళ్లపల్లికి చెందిన వైసీపీ ఎంపీటీసీ పెద్దప్పయ్యతో పాటు ఓబిరెడ్డి టీడీపీలోకి చేరారు. మంగళవారం ధర్మవరం టీడీపీ కార్యాలయంలో పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో పార్టీలోకి చేరారు. అదేవిధంగా బద్దలాపురం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు.

గొందిరెడ్డిపల్లిలో ప్రచారం

రాప్తాడు : మండలంలోని గొందిరెడ్డిపల్లిలో మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రచారం చేశారు. కార్యక్రమంలో కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు ఎంపీటీసీ జాఫర్, సర్పంచ్ శీనయ్య, మల్లికార్జున, ఉజ్జినప్ప పాల్గొన్నారు.

నేడు నామినేషన్

ఆత్మకూరు: రాప్తాడు కూటమి అభ్యర్థి పరిటాల సునీత బుధవారం నామినేషన్ వేస్తున్నారని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల టీడీపీ కన్వీనర్ శ్రీనివాసులు కోరారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.




కక్కలపల్లిలో పరిటాల శైలాజ, సిండికేట్‌నగర్‌లో పరిటాల జ్ఞాన ప్రచారం

అనంతలో జీఆర్‌టీ జ్యువెలర్స్ షోరూం ప్రారంభం

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 23: నగరంలో జీఆర్‌టీ జ్యువెలర్స్ 60వ షోరూం ఈ నెల 15వ తేదీన ఘనంగా ప్రారంభమైంది. ఆభరణాల రంగంలో 1964వ సంవత్సరం నుంచి నమ్మకం, స్వచ్ఛత, నైపుణ్యానికి చిహ్నంగా నిలుస్తోంది. జీఆర్‌టీ జ్యువెలర్స్‌లో వజ్రాలు, ప్లాటినం, రత్నాలు పొదిగిన బంగారం, వెండి ఆభరణాలను రూపొందించారు. టైమ్‌లెస్ క్రియేషన్లు, ప్రతిష్ఠాత్మకమైన జ్ఞాపకాలను కలిగి ఉండటంతో లెక్క లేనన్ని ప్రత్యేక లక్షణాలు అంతర్భాగంగా ఉన్నాయి. ఈ జ్యువెలర్స్ 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 15న నగరంలోని సప్తగిరిసర్కిల్ సమీపం లో 60వ షోరూం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. కొత్త ఆభరణాల కొనుగోలులో ప్రతి గ్రాము బంగారంపై రూ. 50 తగ్గింపు ధరతో పాటు బంగారు ఆభరణాల మార్పిడిపై గ్రాముకు అదనంగా రూ.50ను వినియోగదారులు పొందేలా అవకాశంకల్పించారు. వజ్రాలు, అన్ కట్ వజ్రాల(సాలిటైర్‌లు మినహా) విలువపై రూ. 10 శాతం తగ్గింపు, వెండి వస్తువుల మేకింగ్ చార్జీలపై 25 శాతం, వెండి ఆభరణాల ఎమ్మార్పీపై 10 శాతం తగ్గింపు పొందవచ్చు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ఎండీ జీఆర్ రాధాకృష్ణన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్, అనంత పద్మనాభన్ కోరారు.



అనంతపురంలోని జీఆర్‌టీ జ్యువెలర్స్ షోరూం

విధ్వంసమే అజెండాగా జగన్ పాలన

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 23 : విధ్వంసమే అజెండగా సీఎం జగన్ పాలన సాగించాడని టీడీపీ అనంత అర్బన్ పరిశీలకుడు రమణారెడ్డి మండిపడ్డారు. మంగళవారం ఆయన స్థానిక శ్రీనగర్ కాలనీలోని అనంత అర్బన్ టీడీపీ కార్యాలయంలో మాట్లాడారు. అన్నింటా అరాచకం, విధ్వంసంతో సాగుతున్న వైసీపీ పాలను సాగనంపేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని కోరారు. రూ.12 లక్షల కోట్లు అప్పు తెచ్చి, రూ.2 లక్షల కోట్లు సంక్షేమం ఇచ్చారని, మిగతా డబ్బంతా ఏమైందని ప్రశ్నించారు. అనంత అర్బన్‌లో సమస్యలు తాండవిస్తున్నాయని, కనీసం డ్రైనేజీ వ్యవస్థ కూడా సక్రమంగా నిర్వహించకపోవడం దారుణమని అన్నారు. ఒక పారిశ్రామిక వేత్తగా అభివృద్ధిపై స్పష్టమైన దృక్పథంతో ఉన్న దగ్గుబాటి ప్రసాద్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు.

నాయీబ్రాహ్మణుల సంక్షేమమే టీడీపీ ధ్యేయం

అనంతపురంరూరల్, ఏప్రిల్ 23: నాయిబ్రాహ్మణుల సంక్షేమమే తెలుగుదేశం పార్టీ ధ్యేయమని జిల్లా నాయీబ్రాహ్మణ సాధికార సమితి అధ్యక్షుడు రామాంజనేయులు పేర్కొన్నారు. మంగళవారం మాజీ మంత్రి పరిటాల సునీత క్యాంపు కార్యాలయంలో నాయీబ్రాహ్మణులకు సంబంధించిన కరపత్రాలను పరిటాల సిద్ధార్థ చేతుల మీదుగా విడుదల చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. టీడీపీ అధికారంలోకి వస్తే కార్పొరేట్ సంస్థల స్థాయిలో సెలూన్ల ఏర్పాటుకు ప్రోత్సాహకాలు దక్కుతాయన్నారు. సెలూన్లకు 200యూనిట్లు ఉచిత విద్యుత్ పునరుద్ధరణ జరుగుతుందన్నారు. దేవాలయాల్లో పని చేస్తున్న వాయిద్య కళాకారులకు, వృత్తిదారులకు ఉద్యోగ భద్రత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల టీడీపీ కన్వీనర్ జింకా సూర్యనారాయణ, రాప్తాడు నియోజకవర్గం టీడీపీ నాయిబ్రాహ్మణ సాధికార సమితి సభ్యులు కొడిమి రామకృష్ణ, అక్కమ్మ, నవీన్‌కుమార్, నాగభూషణం, మణికంఠ, గోవర్ధన్, అనీల్‌కుమార్ పాల్గొన్నారు.

టీడీపీతోనే అన్ని వర్గాలకు సమన్యాయం

అనంతపురం అర్బన్ : టీడీపీతోనే అన్ని వర్గాలకు సమ న్యాయం జరుగుతుందని టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచెపు వెంకటేష్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక శ్రీనివాస్ నగర్‌లోని టీఎన్‌టీయూసీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసీపీ పాలనలో భవన నిర్మాణ రంగంతోపాటు అన్ని రంగాల్లోని కార్మికులు తీవ్రంగా నష్టపోయారన్నారు. కార్మికులకు అందించాల్సిన సంక్షేమ పథకాలను అమలు చేయకుండా సీఎం జగన్ ద్రోహం చేశారన్నారు. బుధవారం అనంత అర్బన్ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి దగ్గుబాటి ప్రసాద్ నామినేషన్ కార్యక్రమంలో టీఎన్‌టీయూసీ నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

ఆత్మకూరు ఏప్రిల్ 23 : మండలంలోని ముట్టాల, పి సిద్దరాంపురం గ్రామానికి చెందిన ఐదు వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరారు. వీరికి పరిటాల క్యాంపు కార్యాలయంలో పరిటాల సిద్ధార్థ ఆధ్వర్యంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి.
రాప్తాడు : మండలంలోని మరూరు గ్రామానికి చెందిన చిన్నఓబిరెడ్డి, గుడికాటి క్రిష్టప్ప టీడీపీలో చేరారు. అనంతపురంలోని పరిటాల క్యాంపు కార్యాలయంలో పరిటాల సిద్ధార్థ, మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి ఆధ్వర్యంలో చేరారు.

టీడీపీ విస్తృత ప్రచారం

నార్పల : నార్పల మండలంలోని మద్దలపల్లి గ్రామాలలో శింగనమల నియోజకవర్గం టీడీపీ, జనసేన, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణి, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణను గెలపించాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ద్విసభ్య కమిటీ సభ్యుడు ఆలం నరసానాయుడు ప్రచారం నిర్వహించారు.
శింగనమల: బండారు శ్రావణిశ్రీని గెలిపించాలని టీడీపీ మండల మండలంలోని రాచేపల్లి గ్రామంలో వారు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.
గార్లదిన్నె : మర్తాడులో ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి, శింగనమల నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి బండారు శ్రావణి సోదరి బండారు కిన్నెర శ్రీ స్థానిక నాయకులతో కలసి ప్రచారం చేశారు.

ఘనంగా లక్ష్మీగణపతి దేవాలయ వార్షికోత్సవం

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 23: ప్రకాష్‌రోడ్డులోని లక్ష్మీగణపతి మందిర తొమ్మిదో వార్షికోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేకువజామునే స్వామివార్ల మూలవిరాట్‌లకు నిర్మాల్య విసర్జన గావించి, పంచామృతాభిషేకాలు, వెండికవచాలంకరణలు, విశేష పూజాకార్యక్రమాలు నిర్వహించారు. గణనాథునికి కుడుముల మాలలు, ఆంజనేయస్వామికి వడమాలలు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణంలో భక్తులు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను ఆచరించారు. స్వామివారికి మహామంగళహారతి నివేదన అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహ కులు మణికంఠబాబు, సుబ్బారావు, శ్రీనివాసప్రసాద్ పాల్గొన్నారు.



హనుమద్ సమేత లక్ష్మీగణపతి

తాగునీటికి ఇబ్బందులు రాకుండా చూడండి

అనంతపురం టౌన్ : జిల్లాలో ఎక్కడా తాగునీటికి ఇబ్బందులు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు కలెక్టరు వినోద్‌కుమార్ సూచించారు. తొలుత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు ఆదేశాలు ఇచ్చారు. అనంతరం కలెక్టరు అధికారులతో మాట్లాడుతూ.. తాగునీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. కమాండ్ కంట్రోల్‌కు వచ్చే ఫిర్యాదులపై నిర్లక్ష్యం చూపకుండా వాటిని పరిశీలించి సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవా లన్నారు. ఉపాధి కూలీలకు అవసరమైన పనులు చూపించి వలసలు వెళ్లకుండా చూడాలన్నారు.

వైభవంగా బ్రహ్మరథోత్సవం



హనుమద్ సమేత సీతారామలక్ష్మణులు

అనంతపురం కల్చరల్ : శ్రీరామనవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన మంగళవారం స్థానిక మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో బ్రహ్మర థోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం సీతారాములకు వివిధ అభిషేకాలు, సహస్రనా మార్చన నిర్వహించారు. అనంతరం మడుగుతేరును లాగారు. తదనంతరం ఆలయ ఆవరణంలో పండితులు రథాంగహోమం నిర్వహించారు. సాయంత్రం బ్రహ్మరథంలో స్వామివార్లను పురవీధుల్లో ఊరేగించారు. రథోత్సవానికి ముందు కల్లుమడికి చెందిన భజనబృందం ఆధ్వర్యంలో భక్తులు రామకీర్తనలు ఆలపిస్తూ భజనలు చేశారు. రాత్రికి స్వామివార్లకు దశహారతులు సమర్పించారు. అనంతరం ఆలయ ఆవరణంలోని వేదికపై శ్రీ నృత్యశిక్షణాలయం చిన్నారులు సంప్రదాయ నృత్యాలు అలరించాయి.

దుగుమర్రిలో అరటితోట దగ్ధం

నార్పల,ఏప్రిల్ 23: మండలంలోని దుగుమర్రిలోని కల్లాయప్పకు చెందిన 11 వేల అరటి చెట్లు మంగళవారం అగ్నికి ఆహుతయ్యాయి. దాదాపు 8 ఎకరాల్లోని అరటి చెట్లు, డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిబూడిదయ్యాయి. సుమారు రూ.10 లక్షలు నష్టం వాటిల్లిందని బాధిత రైతు కుల్లాయప్ప, ఆయన కుటుంబసభ్యులు విలపించారు. బాధిత రైతును ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు, పలువురు రైతులు కోరుతున్నారు.



శింగనమల అభివృద్ధే లక్ష్యం

కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ

బుక్కరాయసముద్రం, ఏప్రిల్ 23: శింగనమల నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి.. సమస్యలు పరిష్కరించి.. ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ ఏకైక లక్ష్యమని కూటమి శింగనమల ఎమ్మెల్యే అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ అన్నారు. మంగళవారం మండలంలోని అమ్మవారిపేట, రేకులకుంట, రెడ్డిపల్లి, కొర్రపాడు గ్రామాల్లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ద్విసభ్యకమిటీ సభ్యులు ఆలం నరసా నాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా టీడీపీ ఉపాధ్యాక్షుడు పసుపుల హనుమంతురెడ్డి, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబుతో కలిసి ఆమె ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలోనూ వారికి ప్రజలు హరతులు పట్టి.. పూల వర్షం కురిపించారు. ఈ సందర్భంగా బండారు శ్రావణిశ్రీ మాట్లాడుతూ.. అన్ని మండలాల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, గ్రామీణా రోడ్లు, తాగునీటి సమస్య పరిష్కరిస్తామని అన్నారు. వచ్చేది టీడీపీ ప్రభుత్వ మేనని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కన్వీనర్ అశోక్, మార్కెట్ మాజీ వైస్ ఛైర్మన్ సాకే రామక్రిష్ణ, రమణమూర్తి, కేశన్న, నారాయణస్వామి, లక్ష్మీనారాయణ, పొడరాళ్ల రవీంద్రా, మల్లిఖార్జునరెడ్డి, ఓబులపతి, సుధాకర్, వెంకటరెడ్డి, గంగలప్ప, నాగేష్, ఆనంద్‌రెడ్డి, నరేంద్రయాదవ్, రెడ్డిపల్లినాయుడు, రామక్రిష్ణ, అరికలరాజు పాల్గొన్నారు.



రేకులకుంటలో బండారు శ్రావణిశ్రీ ప్రచారం

వైద్యానికి చేయూత

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 23: కాలేయ సమస్యతో బాధపడుతున్న నిరుపేద యువకుడి వైద్యానికి అమ్మ సంస్థ చేయూతనందించింది. బుడ్డప్ప నగర్‌లో నివాసముంటున్న అంజి కొరియర్‌బాయ్‌గా పనిచేస్తుండేవాడు. ఆరు నెలలుగా కాలేయ సమస్యతో బాధపడుతూ బెంగుళూరులోని గ్లోబల్ హాస్పిటల్‌లో పరీక్షలు చేయించుకోగా కాలేయ మార్పిడి అవసరమని వైద్యులు సూచించారు. కాలేయ మార్పిడికి అంజి తల్లి కాలేయాన్ని పరీక్షించగా సరిపోతుందని, కొడుకకు తన కాలేయంలో సగభాగం ఇచ్చేందుకు తల్లి భారతమ్మ అంగీకరించిందని, అయితే ఆపరేషన్ కోసం రూ.15 లక్షలు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. దీంతో వీరికున్న 2 సెంట్ల స్థలాన్ని అమ్మి రూ.9లక్షలు సమకూర్చుకునానరు. మిగిలిన సొమ్ముకోసం అమ్మ సంస్థను ఆశ్రయించారు. ఆ సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి మంగళవారం అంజిని కలిసి రూ.3.5 లక్షల చెక్కును అందజేశారు. మిగిలిన సొమ్ము కూడా దాతల ద్వారా సేకరించి త్వరలో అందజేస్తామని హామీ ఇచ్చారు.

వైభవంగా జాతర

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 23: స్థానిక ఐదో రోడ్డులోని నల్లమల సుంకులమ్మ దేవాలయంలో మంగళ వారం అమ్మవారి జాతర మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు వివిధ అభిషేకాలు, ప్రత్యేక అలంకరణలతో పూజలు నిర్వహించారు. భక్తులు తమ ఇళ్ల నుంచి బోనాలను ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. సాయంత్రం ఆలయం వెలపల పెద్దఎత్తున అన్న సంతర్పణ చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు ఉంగరాల శ్రీనివాసులు, భక్తులు పాల్గొన్నారు.



భక్తిశ్రద్ధలతో బోనాలు

రాప్తాడు, ఏప్రిల్ 23: మండలంలోని బండమీదపల్లి, యర్రగుంట, బోగినేపల్లి, గొళ్లపల్లి, అయ్యవారిపల్లి, షలలరేవు తదితర గ్రామాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో బోనాలు నిర్వహించారు.

బాస్కెట్‌బాల్ విజేతలకు అభినందనలు

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 23: ఏలూరులో ఈనెల 20, 21, 22 తేదీల్లో నిర్వహించిన ఏపీ 9వ అంతర్‌జిల్లా బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లాపై అనంతపురం బాలుర జట్టు విజయం సాధించింది. ఆ క్రీడాకారులను మంగళవారం సాయంత్రం స్థానిక అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియంలో డీఎస్‌డీఓ షఫీ, జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బాకే హబీబుల్లా, నరేంద్రచౌదరి అభినందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వసీం అక్రం, సీనియర్ కోచ్ వెంకటేశ్వర్లు, శాప్‌కోచ్ వంశీ, నరేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

జేఎన్‌టీయూలో వైద్యశిబిరం

అనంతపురం సెంట్రల్ : జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్-3 ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ మమత ఆధ్యక్షతన నిర్వహించిన శిబిరాన్ని వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ శశిధర్ ప్రారంభించారు. అనంతరం ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులకు గుండె పరీక్షలు నిర్వహించి తగిన మందులను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు

అనంతపురం కల్చరల్ : చైత్రశుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని మంగళవారం నగరంలోని పలు ఆలయాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. మూడో రోడ్డులోని షిర్డిసాయిబాబా ఆలయంలో ప్రత్యేకంగా అలంకరించిన వ్రతమంటపంలో సత్యనారాయణస్వామిని విశేషంగా అలంకరించి.. వ్రతాలను నిర్వహించారు.

సీపీఐ జాఫర్ నామినేషన్ దాఖలు



అనంతపురం విద్య, ఏప్రిల్ 23 : ఇండియా కూటమి అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ నామినేషన్ మంగళవారం నామినేషన్ వేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, ఇండియా కూటమి అభ్యర్థులు, మాజీ మంత్రి శైలజానాథ్, ఇతర ముఖ్యనేతలు, వేలాది మంది సీపీఐ, ఇండియా కూటమి శ్రేణుల నడుమ ర్యాలీగా వెళ్లి నామినేషన్ దాఖలు చేశారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు జగదీష్, సీపీఎం రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఓబులేసు, కార్యవర్గసభ్యుడు రాంభూపాల్, సీపీఐ సత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య, ఇతర నాయకులు మల్లికార్జున, నారాయణస్వామి, శ్రీరాములు, లింగమయ్య, సంతోష్‌కుమార్, నాగరాజు, అల్లిపీర, రమణ, ఖాజాహుస్సేన్ పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థుల హవా



విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం, సిబ్బంది

అనంతపురం విద్య, ఏప్రిల్ 23 : టెన్త్ ఫలితాల్లో నారాయణ విద్యార్థులు సత్తా చాటినట్టు ఏజీఎం రమేష్ బాబు పేర్కొన్నారు. పలువురు విద్యార్థులను మంగళవారం ప్రత్యేకంగా అభినందించారు. ఏజీఎం మాట్లాడుతూ.... లక్ష్మీశ్రావణి 595 మార్కులు సాధించి స్కూల్ ఫస్ట్ వచ్చిందన్నారు. స్కూల్‌లో 78 మంది విద్యార్థులు చదువుతుంటే 594, 592, 591, 590 మార్కుల పైన ఆరుగురు విద్యార్థులు సాధించారన్నారు. స్కూల్‌లో వందశాతం ఫలితాలు వచ్చాయని తెలిపారు. టాపర్ లక్ష్మీశ్రావణి మాట్లాడుతూ.. టీచర్లు అందించిన ప్రోత్సాహం వల్లే ఉత్తమ మార్కులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ సీఓ కో-ఆర్డినేటర్ ప్రేమ్‌సాగర్, ప్రిన్సిపాల్ శ్రీధర్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం ప్రెస్‌క్లబ్ : గొల్లలదొడ్డి బాలుర గిరిజన గురుకుల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులలో ప్రవేశాలకు పదో తరగతి చదివిన విద్యార్థులు అర్హులన్నారు. మొత్తం 120 సీట్లు ఉన్నాయన్నారు. వాటిలో ఎస్సీ, బీసీ, ఓసీ, ఏఈక్యూల కేటగిరీలకు మూడు సీట్లు చొప్పున, మిగిలిన 108 సీట్లు ఎస్టీ విద్యార్థులకు కేటాయించామన్నారు. ఈ నెల 24వ తేదీ నుంచి మే 15వ తేదీ వరకూ దరఖాస్తులు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 95426 55088, 99481 00343ను సంప్రదించాలని సూచించారు.

ఇక ఎంజాయ్..!



అమ్మా.. ఇక స్కూల్ లేదూ...

విద్యాసంవత్సరం ముగియడంతో మంగళవారం మధ్యాహ్నం నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు సెలవులు ప్రకటించాయి. దీంతో ఏడాదంతా చదువులు, పరీక్షలతో సతమతమైన విద్యార్థులు సెలవుల సందడిని ఆనందించేందుకు ఇళ్లబాట పట్టారు. ఈ నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే విద్యార్థులు, తల్లిదండ్రులతో బస్టాండ్లు బిజీ బిజీగా దర్శనమిచ్చాయి. తమ ఊరికి వెళ్లే బస్సులో సీట్లు కోసం ప్రయాణికులు, విద్యార్థులు పోటీ పడ్డారు.

- అనంతపురం కల్చరల్



అన్నా... ఒక సీటు పట్టుకోవా..




సొంతూరుకు వెళ్తున్నందుకు సంతోషం.. ఫ్రెండ్స్‌ను వీడుతున్నందుకు బాధ



హమ్మయ్య.. అసలైన భారం తగ్గింది సామీ..



త్వరగా ఊరికి పోదాంపా అమ్మా...



చీనీకాయల ధర...

అనంతపురంరూరల్ : అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.36 వేలు, కనిష్ఠంగా రూ.15 వేలు, సరాసరి రూ.25 వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 501 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

వైభవంగా మల్లేశ్వరస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

ఉరవకొండ, ఏప్రిల్ 23: పట్టణంలో మల్లేశ్వరస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారి మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉత్సవమూర్తులను మేళతాళాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి రథంపై అధిష్టింపచేశారు. రథాన్ని చాబాల రోడ్డు వరకూ లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. మండలంలోని రాకెట్ల గ్రామంలో మంగళవారం సుంకలమ్మదేవి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

కమనీయం... రంగనాథస్వామి కల్యాణం...

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 23: మండలంలోని ఆలూరుకోన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీదేవిభూదేవి సమేత రంగనాథస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక అలంకరణ చేసి పూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య, మంగళవాయిద్యాలతో కల్యాణం జరిపించారు. అనంతరం స్వామివార్ల రథోత్సవం కన్నులపండువగా సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రంగనాథస్వామిని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డిదర్శించుకున్నారు.


కల్యాణం అనంతరం కొలువుదీరిన స్వామి, అమ్మవార్లు

ఘనంగా జంబులింగేశ్వర స్వామి రథోత్సవం

విడపనకల్లు, ఏప్రిల్ 23: మండలంలోని హావళిగి గ్రామంలో జంబులింగేశ్వర స్వామి రథోత్సవాన్ని మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామిని ప్రత్యేక పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామి వారి ఉత్సవమూర్తిని ఊరేగింపుగా తెచ్చి రథంలో కొలువు దీర్చారు. అనంతరం భక్తులు రథాన్ని ఆలయం వద్ద నుంచి గౌరమ్మ దేవాలయం వద్ద వరకు లాగారు. తిరిగి జంబులింగేశ్వర ఆలయం చేరుకోవటంతో రథోత్సవ వేడుకలు ముగిశాయి. అలాగే వీ కొత్త కోట రోడ్డులో వెలసిన పొడరాళ్ల ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్‌జయంతిని ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారిని ప్రత్యేక పూలతో అలంకరించి, ఆకు పూజలు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులకు అన్న దానం చేశారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవ విగ్రహం ఊరేగింపు

కణేకల్లు, ఏప్రిల్ 23: మండల కేంద్రంలో వెలసిన చిక్కణ్ణేశ్వరస్వామి ఉత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి ఉత్సవ విగ్రహాన్ని పురవీధులలో ఊరేగించారు. స్వామివారి మూలవిరాట్‌ను ఎద్దుల బండిలో ప్రత్యేకంగా అలంకరించి గ్రామపురవీధులలో లాగారు. అలాగే సిద్ధప్పస్వామి ఉత్సవ విగ్రహానికి కూడా దిగువ గేరి వరకు లాగారు.


ఉత్సవ విగ్రహాన్ని లాగుతున్న భక్తులు

నేడు రథోత్సవం: చిక్కణ్ణేశ్వరస్వామి రథోత్సవం బుధవారం నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. అలాగే పంచాయతీ ఆధ్వర్యంలో ఎద్దుల పరుషను ఏర్పాటు చేసినట్లు ఈట ప్రసాద్, సర్పంచ్ నిర్మల పేర్కొన్నారు.

వీరహనుమాన్ విజయయాత్ర

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 23: పట్టణంలోని భజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో మంగళవారం వీరహనుమాన్ విజయ యాత్రను నిర్వహించారు. హనుమాన్ ఉత్సవ మూర్తిని రథంలో కొలువు దీర్చి పూజలు చేశారు. స్థానిక బీరప్ప దేవాలయం నుంచి హనుమాన్ యాత్ర మెయిన్ రోడ్డు మీదుగా కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయం వరకు కొనసాగింది. వాసవి గ్రూప్ చైర్మన్ సత్రశాల రామ్మోహన్ గుప్త, సేవాప్రముఖ్ రామ్మూర్తి, నగర అధ్యక్షుడు మాణిక్‌చంద్ కార్యా భజరంగ్‌దళ్ రాష్ట్ర సప్తాహిక్ కన్వీనర్ కసాపురం రవి, సేవాప్రముఖ్ బండి మురళి, కార్యదర్శి ప్రభాకర్, గద్వాల్‌ప్రతాప్ పాల్గొన్నారు.


యాత్రలో పాల్గొన్న భజరంగ్‌దళ్ నాయకులు

కన్నుల పండువగా విరూపాక్షేశ్వరస్వామి కల్యాణం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 23: మండలంలోని దోనిముక్కల గ్రామంలో వెలసిన విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం పంపమ్మ విరూపాక్షేశ్వరస్వామి, సీతారాముల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆలయ అవరణంలో పంపమ్మ విరూపాక్షేశ్వరస్వామి, సీతారాముల ఉత్సవమూర్తులను కొలువుదీర్చారు. అర్చకులు మేళతాళాల మధ్య కల్యాణాన్ని జరిపించారు. సాయంత్రం పంపమ్మ విరూపాక్షేశ్వరస్వామి ఉత్సవమూర్తులను రథంలో కొలువుదీర్చి రథోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ చైర్మన్ సంజీవమ్మ, అర్చకుడు శ్రీధర్ గుప్త, భక్తులు పాల్గొన్నారు.

సంగమేశ్వరస్వామి ఉత్సవాలు ప్రారంభం

బొమ్మనహాళ్, ఏప్రిల్ 23: మండలంలోని సింగానహళ్లి శివారులో వేదవతి హగరి నది ఒడ్డున వెలసిన సంగమేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి ఉత్సవాలు ఆలయ కమిటీ పెద్దలు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం గంగాజలం తెచ్చి సింగానహళ్లి గ్రా మం నుంచి సంగమ్మ, సంగమేశ్వర విగ్రహాలను ఊరేగింపుతో తీసుకెళ్లి ఆలయం లో విశేష పూజలు నిర్వహించారు. స్వామివారి రథోత్సవం బుధవారం సాయం త్రం ఐదు గంటలకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు.

అంబమ్మ దేవి రథోత్సవం

గుంతకల్లుటౌన్, ఏప్రిల్ 23: పట్టణంలోని పాతగుత్తి రోడ్డులో వెలసిన అంబమ్మ దేవాలయంలో మంగళవారం సాయంత్రం అమ్మవారి రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి విశేష పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం రథాన్ని వివిధ పుష్పాలతో అలంకరించారు. రథంలో అమ్మవారిని ఉత్సవ మూర్తిని కొలువుదీర్చారు. రథానికి అర్చకులు పూజలు చేశారు. మేళతాళాల మధ్య భక్తులు రథాన్ని లాగారు. నాగసముద్రం గ్రామంలో కదిరి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో మంగళవారం సామూహిక వివాహాలను విశ్వనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. టీడీపీ అభ్యర్థి గుమ్మనూరు జయరాం సోదరుడు గుమ్మనూరు శ్రీనివాసులు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కిరణ్‌కుమార్‌గౌడ్ హాజరయ్యారు. సాయంత్రం రథోత్సవాన్ని నిర్వహించారు.

పులికనుమ పెద్దమ్మ...

పామిడి: మండలంలోని సొరకాయలపేట పులికనుమ పెద్దమ్మ రథోత్సవం మంగళవారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథోత్సవం కన్నుల పండువగా సాగింది. గుమ్మనూరు జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ హాజరయ్యారు.

ఘనంగా తిమ్మదాసుల స్వామి ఆరాధన

బెళుగుప్ప, ఏప్రిల్ 23: మండలంలోని ఎర్రగుడి కొట్టాలలో వెలసిన తిమ్మదాసుల స్వామి 29వ ఆరాధన మహోత్సవాన్ని మంగళవారం మఠం పీఠాధిపతి మహాలింగస్వామి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం రథాన్ని లాగి తీర్థ ప్రసాదాల వినియోగం, రాత్రి శిష్య బృందంచే భజనలతో ఆరాధన ముగిసినట్లు భక్తమండలి తెలిపింది.

కళ్యాణదుర్గంలో వైసీపీకి భారీ షాక్!

- టీడీపీలోకి భారీగా చేరికలు
- ఒక్కరోజులోనే 200 కుటుంబాల చేరిక
- పార్టీలోకి ఆహ్వానించిన అమిలినేని

కళ్యాణదుర్గం, ఏప్రిల్ 23: కళ్యాణదుర్గంలో వైసీపీ భారీ షాక్ తగిలింది. రోజురోజుకు టీడీపీకి ఆదరణ పెరుగుతోంది. ప్రతిరోజు పార్టీలోకి చేరికలు ఊపందుకున్నాయి. మంగళవారం ఒక్కరోజులోనే 200 వైసీపీ కుటుంబాలు టీడీపీలోకి చేరాయి. కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని సురేంద్రబాబు పార్టీలో చేరివారికి టీడీపీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. కంబదూరు మండలం మర్రిమాకులపల్లికి చెందిన 10 వైసీపీ కుటుంబాలు, కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లికి చెందిన 30,


అమిలినేనికి గజమాలతో స్వాగతం పలుకుతున్న నాయకులు


టీడీపీలో చేరిన వారితో ఎమ్మెల్యే అభ్యర్థి అమిలినేని

కుందుర్పి మండలం తమ్మయ్యదొడ్డి గ్రామానికి చెందిన 15, కళ్యాణదుర్గం మండలం విట్లంపల్లికి చెందిన 40, బ్రహ్మసముద్రం మండలం వెస్ట్ కోడపల్లికి చెందిన 75, కన్నేపల్లికి చెందిన 30 వైసీపీ కుటుంబాలు చేరాయి. ఈ సందర్భంగా అమిలినేని మాట్లాడుతూ కళ్యాణదుర్గంలో రోజురోజుకి టీడీపీకి ప్రజాదరణ పెరుగుతోందన్నారు. ప్రజాబలంతోనే ఈ ఎన్నికల్లో 50 వేల మెజార్టీతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అందరూ ఐక్యతతో టీడీపీ గెలుపునకు అహర్నిశలు కృషి చేద్దామని పిలుపునిచ్చారు. ప్రజా బలాన్ని చూసి వైసీపీ గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయన్నారు. టీడీపీ పాలనవైపు ప్రజలు మొగ్గు చూపుతున్నారనడానికి ఈ చేరికలే నిదర్శనమన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ప్రజలందరూ ఆ పార్టీపై విసుగు చెందారని విమర్శించారు. టీడీపీకి వస్తున్న ప్రజాబలమే గెలుపునకు నాంది అన్నారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు, ప్రజలు, అభిమానులు పాల్గొన్నారు.

దౌర్జన్యాలు చేసి ఉంటే భారీ మెజారిటీతో గెలుస్తానా?

- టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గుమ్మనూరు జయరాం

గుంతకల్లు, ఏప్రిల్ 23: తాను ఆలూరులో నిజంగా దౌర్జన్యాలు చేసి ఉంటే భారీ మెజారిటీతో గెలిచి మంత్రిని అయ్యుండేవాడిని కాదని గుంతకల్లు కూటమి అభ్యర్థి గుమ్మనూరు జయరాం అన్నారు. మంగళవారం ఉదయం పట్టణంలోని సాయికృష్ణ నర్సింగ్ హోంలో టీడీపీ డాక్టర్స్ సెల్ నాయకురాలు పత్తి హిమబిందు ఆధ్వర్యంలో ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు అంబికా లక్ష్మీనారాయణ, గుమ్మనూరు జయరాం ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. జయరాం మాట్లాడుతూ దౌర్జన్యపరుడినంటూ తనపై స్థానిక ఎమ్మెల్యే వెంకట రామిరెడ్డి దుష్ప్రచారం చేస్తున్నాడన్నారు. తామిద్దరూ ఒకరిపై ఒకరు చేసిన ఆరోపణలపై కసాపురం దేవస్థానంలో ప్రమాణం చేద్దాం రమ్మని సవాలు విసిరానని, దానికి అతడి నుంచి స్పందన లేదన్నారు. ఎంపీ అభ్యర్థి మాట్లాడుతూ వ్యాపారులుగా ఉన్న వైశ్యులు ఇంటివద్దా, షాపుల వద్దా రెండుసార్లు చెత్తపన్ను చెల్లిస్తున్నారని టీడీపీ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తొలగిస్తామన్నారు. గుమ్మనూరు నారాయణ స్వామి, ఆర్యవైశ్య మహాసభ రాయలసీమ రీజియన్ చైర్మన్ నగరూరు చంద్ర మహేశ్, పొలిటికల్ అడ్వయిజరీ కమిటీ చైర్మన్ వంకదారు వెంకటకృష్ణ, కౌన్సిలరు కృపాకర్, డాక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి

గుంతకల్లుటౌన్: శాసనసభ ఎన్నికల్లో ఒక్క అవకావం ఇవ్వండి, గుంతకల్లును అభివృద్ధి చేసి చూపిస్తానని గుమ్మనూరు జయరాం ఓటర్లను అభ్యర్థించారు. పట్టణంలోని కేసీ నారాయణ, రోటరీ హైస్కూల్ యాజమాన్యంతో మంగళవారం జయరాం, ఎంపీ అభ్యర్థి అంబికా లక్ష్మీనారాయణ సమావేశం అయ్యారు. వారు మాట్లాడుతూ.. వైసీపీ నాయకులు చేసే తప్పుడు ప్రచారాల గురించి నమ్మకండి అన్నారు. కేసీ హరి, మూస్టూరు తిమ్మప్ప, పత్తిహిమబిందు పాల్గొన్నారు.

నామినేషన్ చూసి నిద్రపట్టి ఉండదు

పామిడి: గుంతకల్లు కూటమి అభ్యర్థిగా గుమ్మనూరు జయరాం సోమవారం జనసునామీతో నామినేషన్ దాఖలు చేయడాన్ని చూసి ఎమ్మెల్యే వెంకట్రామిరెడ్డికి నిద్రపట్టి ఉండదని జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ సెటైర్లు వేశారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం తెలుగు తమ్ముళ్లతో ఆయన సమీక్షించారు. 25న వైసీపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి నామినేషన్‌కు జన సమీకరణకు నాలుగు నియోజకవర్గాల నుంచి జనాన్ని పోగుచేస్తున్నారని ఎద్దేవా చేశారు. జనబలం చూపించుకునేందుకు ఎమ్మిగనూరు, ఆదోని, ఉరవకొండ, గుంతకల్లు నియోజకవర్గాల నుంచి జనం వచ్చేలా ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిసిందని చురకలంటించారు. నామినేషన్‌కు తరలివచ్చిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు.


మాట్లాడుతున్న జయరాం, చిత్రంలో అంబికా తదితరులు

సమస్యలన్నీ పరిష్కరిస్తా

గుత్తిరూరల్: అధికారంలోకి రాగానే గ్రామాలల్లోని సమస్యలన్నీ పరిష్కరిస్తామని గుమ్మనూరు జయరాం హామీ ఇచ్చారు. మంగళవారం మండలంలోని యంగన్నపల్లి, ఊటకల్లు, బేతాపల్లి గ్రామాలల్లో ప్రచారం నిర్వహించారు. జయరాం మాట్లడుతూ చంద్రబాబు నాయుడిని ముఖ్యమంత్రిగా చేస్తే మన రాష్ట్రం బాగుంటుందన్నారు. గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానన్నారు. మండల కన్వీనర్ బర్దివలి, కెసి హరి, చిన్నరెడ్డి యాదవ్ పాల్గొన్నారు.


జయరాంకు గజమాల వేస్తున్న టీడీపీ నాయకులు

అక్రమ మద్యం స్వాధీనం

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 23: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యం 10 బాక్సులను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ మురళీమోహన్ తెలిపారు. గుమ్మఘట్ట మండలం తాళ్లకెర గ్రామ సమీపంలో అక్రమంగా నిల్వ ఉంచారనే సమాచారాన్ని సేకరించి సిబ్బందితో దాడి చేసి 10 బాక్సులలో 960 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకునానమన్నారు. తాళ్లకెర గ్రామానికి చెందిన రుద్రన్న, వీరన్న అనే వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు.

ఆరుగురి బైండోవర్

యల్లనూరు, ఏప్రిల్ 23: మండలంలో మంగళవారం ఆరుగురిపై బైండోవర్ కేసులు నమోదుచేసినట్లు ఎస్‌ఐ గిరిబాబు తెలిపారు. యల్లనూరులో వివిధ కేసుల్లో ఉన్న ముగ్గురిని, వెన్నపూసపల్లిలో ముగ్గురిపై కేసు నమోదుచేసి వద్ద హాజరుపరిచినట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు 90మందిపై బైండోవర్ కేసులు నమోదు చేశామన్నారు.

మామిడి చెట్ల నరికివేత

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 23: గుర్తుతెలియని వ్యక్తులు మామిడి చెట్లను నరికివేసిన సంఘటన శెట్టూరు మండలం అనుంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు అనుంపల్లికి చెందిన రైతు గడ్డి మల్లారెడ్డి వ్యవసాయ పొలంలో మామిడి చెట్లు సాగుచేశాడు. సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు 93 మామిడి చెట్లను నరికివేసినట్లు బాధిత రైతు తెలిపాడు. చెట్లలో కాయ పక్వానికి వచ్చిందని ఈ క్రమంలో నరికి వేయడంతో రైతు బోరున విలపించాడు. శెట్టూరు పోలీసులు తట వద్ద చేరుకుని పరిశీలించారు. రైతు ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాంభూపాల్ తెలిపారు.

జూదరుల అరెస్టు

కళ్యాణదుర్గంరూరల్, ఏప్రిల్ 23: మండలంలోని బట్టువానిపల్లి శివారులో జూదం ఆడుతున్నారని సమాచారం తెలుసుకున్న పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. పది మంది జూదరులను అరెస్టు చేసి వారి నుంచి రూ.87270, ఏడు ద్విచక్ర వాహనాలను సీజ్ చేసి కేసు నమోదు చేశామన్నారు.

బైక్ దగ్ధం

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 23: పట్టణంలోని నందలపాడుకు చెందిన వైసీపీ మద్దతుదారుడు అలీకి చెందిన స్కూటీకి మంగళవారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా కాలిపోయినట్లు ఎస్‌ఐ గౌస్‌బాషా తెలిపారు. ఇంటిముందు పార్కింగ్ చేసిన స్కూటికి పెట్రోల్ పోసి నిప్పంటించారు. మంటలు వ్యాపించి పక్కనే ఉన్న కారు వెనుక భాగానికి వ్యాపించాయి. గమనించిన స్థానికులు మంటలను ఆర్పివేశారు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నిల్వ ఉంచిన మిరపకు నిప్పు

కుందుర్పి, ఏప్రిల్ 23: మండలంలోని మలయనూరు పంచాయతీ నాగిపల్లి గ్రామవాసి గొల్ల నాగప్పకు చెందిన నిల్వ వుంచిన ఎండుమిర్చిని సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టడంతో పూర్తిగా దగ్ధమైంది. నాగప్ప అనే కవులు రైతు మూడున్నర ఎకరాలలో బ్యాడిగి మిర్చి సాగుకు రూ.2 లక్షలు వరకు పెట్టుబడులు పెట్టి చేతికి అందిన పంటను రాశిగా పోసి భద్రంగా ఉంచాడు. ఆరోగ్యం సరిగా లేక పోవడంతో రైతు ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకుని ఇంట్లోనే నిద్రస్తుండటంతో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు పంటకు నిప్పు పెట్టారు. సంఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ప్రభుత్వ స్థలాలను కాపాడండి

యాడికి, ఏప్రిల్ 23: యాడికి, రాయలచెరువుల్లో అధికారపార్టీ వారు అన్యాక్రాంతం చేసిన ప్రభుత్వ స్థలాలను రక్షించాలని కోరుతూ టీడీపీ నాయకులు మంగళవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓ నాగేశ్వర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యాడికిలో సర్వేనెంబర్ 519సిలోని ఆరుసెంట్ల ప్రభుత్వ స్థలం అన్యాక్రాంతమైందని తెలిపారు. రాయలచెరువులో సర్వేనెంబర్లు 258ఏ, బీలలో 2.71ఎకరాలు ఈతవనం స్థలం అధికారపార్టీకి చెందిన వారు కబ్జా చేశారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో టీడీపీ మండల కన్వీనర్ రుద్రమనాయుడు, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, శ్యాంసుందర్‌నాయుడు, పరిమి చరణ్, రామానాయుడు, నెట్టికంటయ్య, శ్రీనివాసులు ఉన్నారు.

వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా

యాడికి, ఏప్రిల్ 23: పెద్దపేట గ్రామానికి చెందిన శివశక్తి గ్రామైఖ్య సంఘం యానిమేటర్ లక్ష్మీదేవి వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేసినట్లు వైకెపీ ఏపీఎం చంద్రశేఖర్ మంగళవారం తెలిపారు. యానిమేటర్ లక్ష్మీదేవి శనివారం తనకు ఫోన్‌చేసి రాజీనామా చేస్తున్నట్లు రాజీనామా లేఖను అందజేయడానికి వచ్చానని తెలిపినట్లు చెప్పారు. తాను సెలవులో ఉన్నందున రాజీనామా లేఖను అకౌంటెంట్‌కు ఇవ్వాలని చెప్పానని ఆయన తెలిపారు. సోమవారం విధులకు వచ్చిన తర్వాత యానిమేటర్ రాజీనామా లేఖను ఆమోదించినట్లు తెలిపారు.

ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు సాధించొచ్చు

రాయదుర్గంరూరల్, ఏప్రిల్ 23: విద్యార్థులు ఎంత కష్టమైనా ఇష్టంగా చదివితే మంచి ఫలితాలు సాధించవచ్చని ఎంఈఓ-2 వెంకటేష్ అన్నారు. పది ఫలితాలలో రాష్ట్ర ఐదో ర్యాంకు సాధించిన మైత్రిని స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు ముందుకెళ్లాలని సూచించారు. మంగళవారం సెయింట్ పాల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో మైత్రిని అభినందించారు. మైత్రితో పాటు టాపర్లుగా నిలిచిన ప్రీతి, మహిత, హంసశ్విని లను పలువురు అభినందించారు. పాఠశాల కరస్పాండెంట్ సుగుణ జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందన

తాడిపత్రిటౌన్, ఏప్రిల్ 23: పది ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన శ్రీవాణి హైస్కూల్ విద్యార్థులను మంగళవారం ఆ సంస్థ చైర్మన్ గంగాధర్ అభినందించారు. పట్టణంలోని పుట్లూరురోడ్డులో ఉన్న పాఠశాలలో అభినందన సభ నిర్వహించారు. ప్రతిభచూపిన లక్ష్మీసుదీశ, మధులత, విష్ణుప్రియ, మోక్షిత్, తేజస్విని, అఖిల, సుజయ్‌రాజ్‌లకు పుష్పగుచ్ఛాలు అందించారు. అకడమిక్ డైరెక్టర్ కార్తీక్, ప్రిన్సిపాల్ బాలస్వామి, ఇస్మాయిల్, అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

కన్నుల పండువగా సంగమేశ్వర స్వామి రథోత్సవం

కూడేరు, ఏప్రిల్ 23: జోడులింగాల సంగమేశ్వర స్వామి, మడుగుతేరు, రథోత్సవం వేడుకలు కన్నుల పండువగా సాగింది. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం మడుగుతేరు నిర్వహించారు. రథం లాగే సమయంలో భక్తులు గుమ్మడి కాయలు, సమర్పించారు. స్వామి వారి రథం వద్ద వేదపండితులు, ఆలయ అర్చకులు హోమాలు నిర్వహించారు. సాయంత్రం జరిగిన రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. స్వామి వారిని దర్శించుకోవడానికి ఉదయం నుండి భక్తుల తాకిడి పెరిగి పోవడంతో ఆలయ కమిటి సభ్యులు, అధికారులు, పోలీసులు తగిన ఏర్పాట్లు చేశారు.


రథాన్ని లాగుతున్న భక్తులు

అభివృద్ధికి పట్టం కట్టండి: జేసీపీఆర్

పెద్దవడుగూరు, ఏప్రిల్ 23: సైకిల్ గుర్తుకు ఓటువేసి అభివృద్ధికి పట్టం కట్టాలని తాడిపత్రి టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని కిష్టిపాడులో మంగళవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ప్రజల యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో సైకిల్ గుర్తుకు ఓటువేసి కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డిని అఖండ మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు కేశవరెడ్డి, మండల కన్వీనర్ కొండూరు కేశవరెడ్డి, చిరంజీవులు, హాజీబాబా, నాగరాజు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్: పట్టణంలోని పీర్లమాన్యం, రెడ్డివారిపాలెంకు చెందిన వందమంది మంగళవారం టీడీపీలో చేరారు. మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. చంద్ర, తేజ, శ్రీరాములు, మునీంద్ర, అల్లీపీరా తదితరులు ఉన్నారు.

ప్రచారం: పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌లో మంగళవారం కూటమి అభ్యర్థి జేసీ అశ్మిత్‌రెడ్డి తరఫున టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ మేనిఫెస్టో కరపత్రాలను అందించారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు నరేంద్రనాయుడు, చింబిలి ప్రసాద్‌నాయుడు, సురేష్, నరసింహాచారి, ఆంజనేయులు, గంగాధర్, రాజా, రామాంజనేయులు, రాంబాబు పాల్గొన్నారు.


కిష్టిపాడు గ్రామంలో పర్యటిస్తున్న జేసీపీఆర్

టీడీపీలో చేరిక

రాయదుర్గం, ఏప్రిల్ 23: వీరశైవ లింగాయత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాటిల్ రాఘవేంద్రగౌడ్ వైసీపీని వీడి మంగళవారం టీడీపీలో చేరారు. ఆయన ఆధ్వర్యంలో సతీష్, ఇబ్రహీం, టైలర్ గంగన్న, వెంకటేష్, రఫీ, తిమ్మారెడ్డి, రాజు, షఫీ, సుంకన్న, మహేష్‌లతో లతో పాటు 135 కుటుంబాలు పార్టీలో చేరాయి. వీరికి మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీ వీరశైవ లింగాయత్‌లను మోసం చేసిందని టీడీపీని గెలిపించి చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసుకుంటామని వారు తెలిపారు.


టీడీపీలో చేరుతున్న వీరశైవ లింగాయత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాటిల్ రాఘవేంద్రగౌడ్

సొంత గూటికి షబ్బీర్

గతంలో టీడీపీని వీడి వైసీపీలో చేరిన డాక్టర్ షబ్బీర్ మంగళవారం సొంతగూటికి చేరుకున్నారు. పట్టణానికి చెందిన ఆయన వైసీపీలో కీలకనాయకుడిగా ఉండేవారు. ఆయనతో పాటు ఉస్మాన్, ఘని, రాము, హరి, శీనలతో పాటు 24వ వార్డు, 17వ వార్డులకు చెందిన యువతతో వంద కుటుంబాలు టీడీపీలో చేరాయి. కాలవ శ్రీనివాసులు అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని ప్రతిన చేశారు.


టీడీపీలో చేరిన డాక్టర్ షబ్బీర్

40 కుటుంబాల మహిళలు...

పట్టణంలోని 11, 12, 14 వార్డులకు సంబంధించిన 40 కుటుంబాల మహిళలు టీడీపీలో చేరారు. 14వ వార్డులో పర్యటన చేసిన మెట్టు గోవిందరెడ్డి భార్య మెట్టు యశోద తమ వద్దకే వచ్చి ఇష్టం లేకున్నా పార్టీ కండువాలు బలవంతంగా వేశారని వారు వాపోయారు. తాము టీడీపీలో ముందు నుంచి ఉన్నామని మాజీ కౌన్సిలర్ బండి భారతి సమక్షంలో కాలవ శ్రీనివాసులు నివాసంలో పార్టీలో చేరారు.

గార్మెంట్స్ రంగానికి పూర్వ వైభవం

టీడీపీ అధికారంలోకి రాగానే గార్మెంట్స్ రంగానికి పూర్వవైభవం తీసుకొస్తానని కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. మంగళవారం స్వకుళశాలి కళ్యాణమంటపంలో గార్మెంట్స్ యజమానుల సంఘం అధ్యక్షుడు టంకశాల హనుమంతు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన కాలవ మాట్లాడుతూ పరిశ్రమను అభివృద్ధి చేయడంలో తాను ముందున్నానన్నారు.

నామినేషన్‌కు తరలిరండి

రాయదుర్గం పట్టణంలో బుధవారం నిర్వహించే నామినేషన్ కార్యక్రమానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు శాంతినగర్‌లోని బన్నిమహంకాళి ఆలయం వద్ద పూజలు నిర్వహించి ఊరేగింపుగా వినాయకసర్కిల్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు నిర్వహిస్తున్నామన్నారు.

బొమ్మనహాళ్: రాయదుర్గం టీడీపీ అభ్యర్థి కాలవ శ్రీనివాసులు నామినేషన్ కార్యక్రమనిన్న జయప్రదం చేయాలని మండల కన్వీనర్ బలరాంరెడ్డి పిలుపునిచ్చారు. తెలుగురైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొండాపురం కేశవరెడ్డి, సింగల్ విండో మాజీ అధ్యక్షుడు కొత్తపల్లి మల్లికార్జున, క్లస్టర్ కన్వీనర్ మాలపాటి ధనుంజయ ఎల్‌బీ నగర్ గ్రామంలో కార్యకర్తలతో సమావేశమయ్యారు.

వైసీపీలో బీసీలకు తీవ్ర అన్యాయం

కూడేరు, ఏప్రిల్ 23: వైసీపీలో బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని, రెడ్లకు మాత్రం పెద్ద పీట వేశారని మాజీ ఎంపీపీ బోయ మహేశ్వరీ, భర్త బోయ రాజశేఖర్ ఆరోపించారు. సోమవారం టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసుల సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారు మాట్లాడుతూ మండలంలో కాంగ్రెస్, వైసీపీలకు తమ కుటుంబం ఎంత సేవ చేసినా విశ్వేశ్వరరెడ్డి, కుమారుడు ప్రణయ్‌రెడ్డి అన్యాయం చేశారని మండిపడ్డారు. వైసీపీ ఆవిర్భావం నుంచి అధికారంలోకి వచ్చే వరకు మాజీ జడ్పీటీసీ తన తండ్రి మాదన్న ఎంతో శ్రమిస్తే, అధికారంలోకి రాగానే విశ్వేశ్వరరెడ్డి తన సామాజికవర్గానికే పెద్దపీట వేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉరవకొండ నియోజకవర్గంలో వైసీపీ అభ్యర్థి విశ్వేశ్వరరెడ్డి ఓటమే లక్ష్యంగా పని చేస్తామని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్, పయ్యావుల శ్రీనివాసులుతోనే సాధ్యమవుతుందని అన్నారు.



అనంతలో జీఆర్‌టీ జ్యువెలర్స్ షోరూం ప్రారంభం

అనంతపురం అర్బన్, ఏప్రిల్23 : నగరంలో జీఆర్‌టీ జ్యువెలర్స్ 60వ షోరూం ఈనెల 15వ తేదీన ఘనంగా ప్రారంభమైంది. ఆభరణాల రంగంలో 1964వ సంవత్సరం నుంచి నమ్మకం, స్వచ్ఛత, నైపుణ్యానికి చిహ్నంగా నిలుస్తోంది. జీఆర్‌టీ జ్యువెలర్స్‌లో వజ్రాలు, ప్లాటినం, రత్నాలు పొదిగిన బంగారం, వెండి ఆభరణాలను రూపొం దించారు. టైమ్‌లెస్ క్రియేషన్లు, ప్రతిష్ఠాత్మకమైన జ్ఞాపకాలను కలిగి ఉండటంతో లెక్కలేనన్ని ప్ర త్యేక లక్షణాలు అంతర్భాగంగా ఉన్నాయి. ఈ జ్యువెలర్స్ 60వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 15న నగరంలోని సప్తగిరిసర్కిల్ సమీపంలో 60వ షోరూం ప్రారంభించారు. ఈ సందర్భంగా కంపెనీ వినియోగదారులకు ప్రత్యేక ఆఫర్లను ప్రకటించింది. కొత్త ఆభరణాల కొనుగోలులో ప్రతి గ్రాము బంగారంపై రూ. 50 తగ్గింపు ధరతో పాటు బంగారు ఆభరణాల మార్పిడిపై గ్రాముకు అదనంగా రూ.50ను వినియోగదారులు పొందేలా అవకాశంకల్పించారు. వజ్రాలు, అన్ కట్ వజ్రాల(సాలిటైర్‌లు మినహా) విలువపై రూ. 10 శాతం తగ్గింపు, వెండి వస్తువుల మేకింగ్ చార్జీలపై 25 శాతం, వెండి ఆభరణాల ఎమ్మార్పీపై 10 శాతం తగ్గింపు పొందవచ్చు. ఈ అవకాశాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సంస్థ ఎండీ జీఆర్ రాధాకృష్ణన్, మేనేజింగ్ డైరెక్టర్ ఆనంద్, అనంత పద్మనాభన్ కోరారు.



అనంతపురంలోని జీఆర్‌టీ జ్యువెలర్స్ షోరూం

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

బెళుగుప్ప, ఏప్రిల్ 23: మండలంలోని గంగవరం గ్రామశివార్లలో అగ్నిప్రమాదంలో నంద్యాల జిల్లా పొన్నవరం గ్రామానికి చెందిన పెయింటర్ పవన్ (47) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. 18న బైకుపై కళ్యాణదుర్గంకు వెళుతూ బైకు బోల్తాపడటంతో ప్రమాదవశాత్తు రోడ్డు పక్కన మండుతున్న మంటలలో పడ్డాడు. కర్నూలు ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా

డీ.హీరేహాళ్, ఏప్రిల్ 23: మండల వ్యాప్తంగా వలంటీర్లు మూకుమ్మడిగా మంగళవారం రాజీనామా చేశారు. మండలంలోని సోమలాపురం, మలపనగుడి పంచాయతీలకు సంబంధించి 20 మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు అధికారులు తెలిపారు. వలంటీర్లు స్థానిక ఎంపీడీఓకు తమ రాజీనామా పత్రాలను సమర్పించి వెంటనే తమ రాజీనామాను ఆమోదించాలని కోరారు.

బెళుగుప్ప: మండలంలో మంగళవారం గంగవరం వలంటీరు అశ్విని, శీర్పి వలంటీరు మారుతీప్రసాద్ రాజీనామా చేసినట్లు ఎంపీడీవో సుబ్బరాజు తెలిపారు.